J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 16 23.9.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# హైదరాబాద్.. జిందాబాద్

## భాగ్యనగరంపై భాజపా కన్ను

- దేశ రెండవ రాజధానిగా చేసి యూటీగా ప్రకటించే ఆలోచన
- ఒక్క దెబ్బకు రెండు ప్రయోజనాలు
- రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ బలోపేతం పైనే దృష్టి
- కేసీఆర్ దూకుడుకి బ్రేక్..?



*హైదరాబాద్ నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించే ఆలోచనను కేంద్రం పరిశీలిస్తోందా? తెలంగాణ ప్రభుత్వం చేతిలో పలు అవమానాలకు గురి అవుతున్న గవర్నర్ తమిళిసై ఆ దిశగా పావులు కదుపుతున్నారా...?? కేసీఆర్‌కు దూరమై, ఎక్కువ సమయం విజయవాడ సమీపంలోని సీతానగరం ఆశ్రమంలో కాలం గడుపుతున్న చిన్న జీయర్‌స్వామి కూడా ఈ ప్రతిపాదనను కేంద్ర బీజేపీ పెద్దల చెవిలో వేశారా??? ప్రధాని నరేంద్ర మోడీపై ధ్వజమెత్తుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దూకుడుకి బ్రేకు వేసే వ్యూహంలో భాగంగా, ఢిల్లీ పెద్దలు హైదరాబాదుని తమ ఆధీనంలోకి తీసుకోనున్నారా...????*

ఈ ప్రశ్నలన్నిటికీ ఢిల్లీ బీజేపీ ఉన్నత స్థాయి వర్గాల నుండి అవుననే సమాధానం వస్తున్నట్టు సమాచారం అందుతోంది.

"అవును. ఈ ఆలోచన ఇప్పటికిప్పుడు వచ్చింది కాదుకదా ...? చాలా కాలంగా ఉన్నదే." అని ఓ బీజేపీ సీనియర్ నర్మ గర్భంగా చెప్పారు.

వ్యాపార, వాణిజ్య పరంగా ముంబై తరువాత అంతగా ఎదుగుతున్న ఆధునిక నగరంగా హైదరాబాదుకు అంతర్జాతీయంగా పేరొచ్చింది. ఇతర రాష్ట్రాలనుండే కాకుండా ఇతర దేశాల నుండి కూడా కుటుంబాలతో వలస వచ్చి భాగ్యనగరంలో స్థిరపడడానికి లక్షల మంది ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం విడిపోయి ఆంధ్ర అనాధగా మారిన తరువాత ఆంధ్ర నుండి కూడా వలసలు పెరిగాయి. ఇదే క్రమంలో జనాభా పెరుగుతూ పోయినా మరో పాతికేళ్ళ పాటు మౌలికవసతులకు ఢోకాలేదన్న స్థాయిలో హైదరాబాదు నగరం అభివృద్ధి చెందింది. ఇంకా చెందుతోంది కూడా. కలలో కూడా ఊహించని స్థాయిలో అంతర్జాతీయ నగరాలతో పోటీపడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ తరుణంలో హైదరాబాదును దేశ రెండవ రాజధానిగా ప్రకటించి ఢిల్లీ, పుదుచ్చేరి తరహాలో యూనియన్ టెరిటరీ చేసే ఆలోచనలో కేంద్ర పెద్దలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

10లో



# విమానం వాలకుండానే...
# విమానాశ్రయం ఎగిరిపోయింది

**నెల్లూరుజిల్లా దామవరంలో విమానం ఎగురుతుందనే ఆశలు హుష్‌కాకీ అయిపోయాయి. జిల్లా విభజనలో ప్రధాన ప్రాంతాలన్నీ పోయి, బోసిగా మిగిలిపోయిన నెల్లూరుకు అన్నీ నిరాశలే ఎదురవుతున్నాయి. పాతనెల్లూరు జిల్లా నుంచి వైకాపాకి పదికి పది స్థానాలిచ్చినా నెల్లూరు అనాధగానే మిగిలిపోయింది. చెప్పుకోదగ్గ ప్రతిష్టాత్మక ప్రాంతాలన్నీ వెళ్లిపోయాయి. కొత్తగా నెల్లూరు జిల్లాలో కలసిన కందుకూరులో విమానాశ్రయం వస్తుందని, అది ఈ రెండుజిల్లాలకు ఉపయోగంగా ఉంటుందని సిఎం తాజాగా ప్రకటించడంతో నెల్లూరుకు దగ్గరగా ఉన్న దగదర్తి మండలం దామవరంపై పెట్టుకున్న ఆశలన్నీ గాల్లో కలిసిపోయాయి. అందుకు.. రాజకీయకారణాలు కూడా ఉండివుండవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. దామవరంలో విమానాశ్రయానికి తెలుగుదేశం హయాంలో పనులు ప్రారంభం కావడం ఈ 'తరలింపు'కు ప్రధాన కారణం అయివుండవచ్చని కూడా అనుకుంటున్నారు.**

కొత్త ప్రభుత్వాలు వస్తే, పాతవన్నీ కొట్టుకుపోతాయా?..అవి మంచి పథకాలైనా సరే, ఎగిరిపోతాయా?..అన్న మాటకి 'ఔననే' సమాధానం చెప్పుకోవాల్సివస్తోందిప్పుడు. ఒక ప్రభుత్వం ఒక పథకం బావుందని ప్రవేశపెడితే, మరో ప్రభుత్వం వచ్చి అది బాగలేదని నిలిపేయడం సముచితమేనా?.. అన్నది ఇప్పుడు ప్రజల్లో పెద్ద చర్చనీయాంశంగా ఉంటోంది. తాజాగా దామవరం విమానాశ్రయం విషయంలో కూడా అలాంటిదే జరిగింది. ఎప్పుడో 15 ఏళ్ళ క్రితమే, 2014లో జిల్లాలోని దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం నిర్మాణానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అప్పట్లో 1379 ఎకరాల్లో భూములు సేకరించేందుకు అధికారులకు పెద్ద కసరత్తే చేశారు. ఎట్టకేలకు 1060 ఎకరాల దాకా సేకరించారు కూడా. దాదాపు ఈ ఎనిమిదేళ్లుగా

10లో



## ఇంటి తాళాలు పగులగొట్టి..

# దర్జాగా దోచుకుపోయారు

- డబ్బు, బంగారమే కాదు.. బియ్యపు బస్తాలు కూడా పట్టుకుపోయారు
- అల్లూరు పేటసత్రంలో ఇదీ సంగతి



సాధారణంగా దొంగలు డబ్బో నగలో దోచుకుపోతారు, కానీ బియ్యం బస్తాలు కూడా మోసుకుని పట్టుకుపోయిన సంఘటన మండల కేంద్రమైన అల్లూరు పేటసత్రంలో ఇటీవల జరిగింది. ఇంటి యజమాని గండవరపు రామసుబ్బయ్య దంపతులు ఇంటికి తాళం వేసి సంగం మండలంలోని పడమటిపాళెంలోని కూతురి దగ్గరకు వెళ్ళారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి దొంగతనం జరిగిపోయింది. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్ళి, బీరువాను కూడా పగులగొట్టి అందులో ఉన్న 2 లక్షల రూపాయలు, రెండుసవర్ల బంగారంతో పాటు ఇంట్లో ఉన్న బియ్యపు బస్తాలను కూడా ఎత్తుకు పోయినట్లు గుర్తించారు. ఇంకా ఏమైనా దొరుకుతాయని కాబోలు..ఇంట్లో వస్తువులన్నీ దొంగలు చెల్లాచెదరు చేసేశారు. ఆ ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని ఆ తర్వాతెప్పుడో చుట్టుపక్కలవాళ్ళు గుర్తించి ఇంటి యజమానులకు సమాచారం ఇవ్వడంతో, వారు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. దొంగలు చేసిన భీభత్సంతో ఇల్లంతా చిందరవందరగా ఉండడం చూసి, జరిగిన దొంగతనం గురించి గోడుగోడుమంటూ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, క్లూస్‌టీమ్ బృందంతో రంగంలోకి దిగారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి, దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.


# సాగరతీరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## సముద్ర జీవులను సంరక్షించుకోవాలి - కలెక్టర్ చక్రధర్‌బాబు పిలుపు



సాగర తీరంలో వ్యర్థాలను ఏరివేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

సాగరతీరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, సముద్రజీవులను సంరక్షించుకోవాలని, తద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అందరూ కలిసి కట్టుగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా, కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఇటీవల 'స్వచ్ఛ సాగర్–సురక్షిత సాగర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ స్టేషన్ కమాండెంట్ అభిక్ చక్రబర్తి నేతృత్వంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం సముద్రతీరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది, వివిధ పాఠశాలలు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు దాదాపు 500 మంది కృష్ణపట్నం సముద్రతీరంలో వ్యర్థాలను ఏరివేశారు. సముద్రతీరంలో జిల్లా కలెక్టర్ దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉత్సాహంగా నడుస్తూ వ్యర్థాలను ఏరివేస్తూ విద్యార్థులుకు ప్రేరణగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 'స్వచ్ఛ సాగర్–సురక్షిత సాగర్' కార్యక్రమంలో భాగంగా దేశంలోని 7500 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న 75 బీచ్‌లలో 75 రోజులపాటు సముద్ర తీరాల పరిశుభ్రత కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల సముద్రంలో పడవేసే వ్యర్థాలను వెలికి తీసి, సముద్రజలాలను శుభ్రం చేసి, రేపటి భవిష్యత్తుకు స్థిరమైన జీవన విధానం కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమం ఎంతో విశిష్టమైనదన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ఉత్తేజంగా నిర్వహించిన ఇండియన్ కోస్ట్‌గార్డ్ సిబ్బందికి, స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ చిహ్నం సైకత శిల్పాన్ని కృష్ణపట్నం తీరంలో అందంగా తీర్చిదిద్దిన సైకత శిల్ప కళాకారుడు శరత్‌కుమార్‌ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. ఆపరేషనల్ ఓషన్ సర్వీస్ సైంటిస్ట్ నాగ రాజుకుమార్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు, పర్యావరణ సంయోజక్ చంద్రశేఖర్, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు పోలయ్య, తహశీల్దార్ మనోహర్ బాబు, ఎంపీడీఓ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



## 'రుణ యాప్స్'..

# ప్రమాదకరం

రుణాలిస్తామని నమ్మించి వంచించే ఇన్‌స్టెంట్ లోన్‌యాప్స్‌కు దూరంగా ఉండాలని నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ ఇన్స్‌పెక్టర్ కె.నరసింహారావు విద్యార్థులకు సూచించారు. ఇటీవల ఆయన కొత్తూరులోని ఎస్ఆర్ఆర్ ఐటిఐ కళాశాలలోని విద్యార్థులకు లోన్‌యాప్స్ మోసాలపై అవగాహన కలిగించారు. రుణాలు కావాలంటే బ్యాంకుల ద్వారా తీసుకోవడం సురక్షితమని, అంతే తప్ప మోసపూరితమైన యాప్స్ జోలికి పోవద్దని హెచ్చరించారు.

## పెంచలకోనలో

# నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు నవాబుపేటకు చెందిన బి.ప్రసాద్ ఇటీవల లక్షా వెయ్యిన్నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యలకు ఆ విరాళం చెక్కును అందజేశారు.

శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం).. ముద్దుగా పిలుచుకునే పేరు.. బాలు!

తెలుగుపాటకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన పేరు..తెలుగుజాతికే కాదు, భరతజాతికే గర్వకారణమైన పేరు..ఎస్పీ బాలు!.. తన మధురగానంతో అశేషప్రజానీకాన్ని మైమరపించిన మహా సంగీతవేత్త. తెలుగులోనే కాదు, అనేకభాషాల్లో అద్వితీయంగా గానం చేసిన గానగంధర్వుడు.. 'భారతీయ సినిమా గాయకుడు'..మన నెల్లూరు ముద్దుబిడ్డ..బాలు!.

## గతించిపోయి అప్పుడే రెండేళ్ళు.

2020 సెప్టెంబరు 25వ తేది..బాలు మృత్యుఒడిలోకి చేరుకున్న రోజు.. సంగీత లోకాన్ని, అశేషప్రజానీకాన్ని శోకతప్తం చేస్తూ.. సుస్వర రాగాలాపనలు చేసుకుంటూ.. పాటల పల్లకీ ఎక్కి.. ఎక్కడికో.. ఏ దూర సుదూర తీరాలకో.. బాలు తరలిపోయిన రోజు.

# నువ్వు లేనిదెక్కడా?..

## ప్రతినోటా.. ప్రతిచోటా.. నీ మాటే.. నీ పాటే!



***'బాలూ!*** *మీరు భౌతికంగా లేకపోయినా..మాకు మాత్రం మీరు ఉన్నట్లుగానే ఉంది. మీ పాటలు-మాటలన్నీ నిత్యం మాకు వింటున్నట్లుగానే ఉంది. మా మనసుల్లో మీ రూపం కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తూనే ఉంది. నేరుగా మీరు కనిపించడం లేదేనన్న బాధ మాత్రం..అలాగే ఉండిపోయింది. చూస్తూనే..మీ గురించి తలచుకుంటూనే అప్పుడే రెండేళ్ళయిపోయాయి. ఎన్నేళ్ళయినా, మీరు లేకపోయినా..అజరామరమైన మీ పాట ప్రతిచోటా వినిపిస్తూనే ఉంది. మా మనసు కూడా మీ చుట్టూనే తిరుగుతూ ఉంది. అయినా..మీరు లేనిదెక్కడా?..ప్రతినోటా..ప్రతిచోటా మీ పాటే..మీ మాటే!*

ఒక్క మనిషి.. ఎన్ని వేల పాటలు పాడారనీ, ఎన్ని మంచిమాటలు చెప్పారనీ!.. మానవమాత్రులకెవరికీ సాధ్యం కాదది. ఆయన కారణజన్ములు. భగవద్దత్తమైన ఆ స్వరం..ఆయనకో వరం!.. అనితర సాధ్యమైన కృషి ఆయన సొంతం!

పాటే శ్వాసగా-ధ్యాసగా, జీవితమంతా తపించిన సంగీత తపస్వి. తన మధుర గానంతో అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలచిపోయిన చిరయశస్వి..బాలు! ప్రపంచవ్యాప్తంగా కూడా ఆయనకు కోట్లాదిమంది అభిమానులున్నారు. ఆయన మాటలు..పాటలు అన్నీ పూలమూటలు.. తేనె ఊటలే. ఎన్ని వేల పాటలు పాడారో.. ఎన్నెన్ని ఘనమైన సత్కారాలు పొందారో.. అయినా ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. పాటను పట్టుకుని ప్రపంచవ్యాప్తంగా ఎన్ని దేశాలు, ఎన్ని ప్రాంతాలు తిరిగారో.. అయినా ఏనాడూ అలసిపోయినట్లు కనిపించరు. స్నేహితులంటే ఆయనకెంతో ఇష్టం. గానం-స్నేహం ఆయనకు ప్రాణం.

ఎంత తెలిసినా ఏమీ తెలియనట్లుండే నమ్రత, ఎంత ఎదిగినా ఎంతో ఒదిగిపోయే ఆ నిరాడంబరత..ఆయన నుంచే నేర్చుకోవాలి. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అందరితో కలివిడిగా చిరునవ్వులతో కలసిపోయే ఆయన తత్వం, తనకు తెలిసిన జ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే మంచి మనస్తత్వం..వంటివన్నీ అందరికీ ఆదర్శం కావాలి. ఆ మహనీయుని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆయన జీవితప్రస్థానం పూల పాన్పేమీ కాదు.. ఎన్నో కష్టనష్టాలను అధిగమించారు. నిరంతరం కష్టపడి.. జీవితంలో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ.. ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అందుకే.. ఎన్నాళ్ళయినా.. ఎన్నేళ్లయినా..ఏనాటికీ మరపురాని.. మరువలేని.. మరచిపోలేని అద్భుత గాయకునిగా.. గానగంధర్వునిగా.. ఆయన అందరి హృదయాల్లో నిలిచిపోయారు.

**(సెప్టెంబరు 25..**
**మధురగానం.. మూగబోయిన రోజు)**

# మా కుటుంబంపై కుట్ర!

## - మాగుంట శీనయ్య ఆవేదన



***మా**గుంట కుటుంబం ఎంతో గౌరవప్రదమైన కుటుంబం. వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్కడా నీతి తప్పింది లేదు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. వ్యాపారంలో మేం గత 70 ఏళ్ళుగా ఉన్నా, ఎప్పుడూ మాపై చిన్న ఆరోపణ కూడా లేదు. కానీ ఇప్పుడు వ్యాపార ప్రత్యర్థులు మాపై లేనిపోని కుట్రలు చేస్తుండడం దారుణం'..అంటూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ, ఇటీవల ఆయన ఒంగోలులో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి తమ వివరణ తెలియజేశారు. వ్యాపారంలో కానీ, రాజకీయాల్లో కానీ తమ కుటుంబం నిజాయితీగానే ఉంటుందన్నారు. అంతేకాదు, తమ వారసునిగా 2024 ఎన్నికల్లో తమ కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని, తమ కుటుంబానికి ఎల్లప్పుడూ ప్రజల ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నామని అన్నారు. వివరాలిలా ఉన్నాయి.*

- లిక్కర్ కుంభకోణంతో మాకు సంబంధం లేదు
- వ్యాపార ప్రత్యర్థులు మాపై కుట్రలు చేస్తున్నారు
- గత 70 ఏళ్ళుగా లిక్కర్ వ్యాపారంలో ఉన్నాం
- ఎక్కడా మాపై చిన్న ఆరోపణ కూడా లేదు
- వ్యాపారంలో కానీ, రాజకీయాల్లో కానీ మాగుంట కుటుంబం నీతి తప్పదు

'నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాగుంట కుటుంబం ఎంతో కాలంగా ప్రజల బాగోగులు చూస్తూ ప్రజాసేవ చేస్తోంది. 1952 నుంచి మా తండ్రిగారు లిక్కర్ వ్యాపారం ప్రారంభించారు. ఆనాటి నుంచి మేం ఆ వ్యాపారంలో ఉన్నాం. అయినా తమ కుటుంబం ఏ రంగంలో ఉన్నా నిజాయితీగానే ఉంటుంది'.. అని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తమ పాత్ర ఉందంటూ వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఆ కుంభకోణంతో తమ కుటుంబానికి ఎలాంటి పాత్ర లేదన్నారు. ఏడు దశాబ్దాలుగా లిక్కర్ వ్యాపారంలో ఉన్న తమపై వ్యాపార ప్రత్యర్థులు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాది నుంచి వచ్చిన 'రెడ్డి' కుటంబం ఈ వ్యాపారంలో ముందుండడం చూసి ఓర్వలేని వ్యాపారస్తులు కొందరు తమపై కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన చెప్పారు. తమపై ఆరోపణలు చేయడమే కాక తమ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా నిందలు వేస్తూ 'వ్యక్తిత్వ హననం' చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. మాగుంట కుటుంబం అంటే నీతినిజాయితీలకు, సేవాభావానికి మారుపేరని, దేశంలోని 8 రాష్ట్రాలలో ఎంతోకాలంగా మచ్చలేని విధంగా వ్యాపారాలు చేస్తోందని తెలిపారు. తమ కుటుంబం అటు వ్యాపారాల్లోనూ, రాజకీయాల్లోనూ నీతినిజాయితీలతోనే ఉంటుందన్నారు. ఎక్కడా అక్రమాలకు పాల్పడిన దాఖలాలేమీ లేవన్నారు.

### మావద్ద ఎలాంటి అక్రమాలు జరగలేదు :

లిక్కర్ కుంభకోణమంటూ ఆరోపణలు వచ్చాక, ఢిల్లీలోని తమ నివాసాలపై కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు వారి విధ్యుక్తధర్మం ప్రకారం తమ నివాసాలపై దాడులు చేశారని, అయితే ఎక్కడా ఎలాంటి అక్రమాలు జరగలేదని గుర్తించారని చెప్పారు. తనిఖీల సందర్భంగా ఇడి అధికారులకు తాము అన్ని విధాలా సహకరించామన్నారు. ఆ కుంభకోణానికి సంబంధించి తమవద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, అక్రమాలు జరగలేదని ఇడి అధికారులు తేల్చి ఆ మేరకు పంచనామాలో కూడా పొందుపరిచారని ఆయన పేర్కొన్నారు. అయితే, తమ బంధువులెవరో ఈ వ్యాపారంలో ఉంటే, తమకెలాంటి సంబంధం లేకపోయినా తమపేరును కూడా అందులో పెట్టి ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ప్రత్యేకించి తాను ఏ వ్యాపారంలోనూ లేనని, వ్యాపారాల్లో తనకెలాంటి షేర్లు లేవని తెలిపారు. ఎమ్మెల్సీగా ఒకసారి, ఎంపీగా నాలుగుసార్లు ఎన్నికైన తాను బాధ్యతాయుతంగా జీవిస్తున్నానని, తమ కుటుంబం ఎలాంటి అవినీతి అక్రమాల మచ్చలేని కుటుంబమని చెప్పారు. తనకు సంబంధించిన అన్ని వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచామని ఆయన తెలిపారు.

2024లో జరిగే ఎన్నికల్లో తమ కుమారుడు రాఘవరెడ్డి పోటీచేస్తారని, ప్రజల ఆశీస్సులు తమకు అన్నివేళలా ఉంటాయని భావిస్తున్నామని అన్నారు. తన శేషజీవితాన్ని కూడా ప్రజాసేవలోనే గడుపుతానన్నారు.

'మా అన్న.. సుబ్బరామన్న ఆశయాలకు అనుగుణంగా మాగుంట కుటుంబం ఎప్పటికీ నిజాయితీతో ప్రజాసేవ చేస్తుందని, ప్రత్యేకించి ప్రకాశం జిల్లా ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటూ సేవలందిస్తుందని' ఆయన స్పష్టం చేశారు.



# ఆతిథ్యానికి అవార్డు..!

భారతదేశంలోని వివిధ రంగాల నుండి నిష్ణాతులైన వ్యక్తులను, ప్రతిష్టాత్మకమైన సంస్థలను ఎంపికచేసి ప్రతీ యేటా ప్రతిభా అవార్డును అందచేయడం ఎకనమిక్ టైమ్స్ పత్రిక ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది మన నెల్లూరుజిల్లాకి చెందిన యువకులు 'అతిథ్య విభాగంలో' అవార్డును సాధించారు. 'రెడ్‌రైనో క్రాఫ్ట్ బ్రువరి మరియు ఇన్స్‌పైర్డ్ కిచెన్' పేరుతో అధునాతన పానశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నాడు మన నెల్లూరీయుడు పల్లంరెడ్డి కిషోర్‌రెడ్డి. అదే పేరుతో మరో నెల్లూరీయుడు సోమిరెడ్డి అర్జున్‌రెడ్డితో కలసి ఇటీవల హైదరాబాదులో కూడా ఒక శాఖను ప్రారంభించారు. ఈ రెండు శాఖలకు కలిపి అతిథ్య విభాగంలో ఉత్తమ అవార్డును ప్రకటించింది ఎకనమిక్ టైమ్స్. సెప్టెంబర్ 20వ తేదీన కొత్తఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కిషోర్ - అర్జున్‌లు ఈ అవార్డును స్వీకరించారు. యువ ఆతిథ్య సారధులకు 'లాయర్' అభినందనలు.

# బిఎంఆర్‌కు..కొత్త బాధ్యత

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల సలహా కమిటీ సభ్యునిగా నియామాకం



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్)కు కేంద్రప్రభుత్వం కొత్త బాధ్యతను అప్పగించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల సలహా కమిటీలో ఆయనను సభ్యునిగా నియమిస్తూ, అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈనెల 21న బుధవారం నాడు విడుదల చేసింది. ఈ సందర్భంగా బిఎంఆర్ మాట్లాడుతూ, తనను కేంద్రమంత్రిత్వశాఖ సలహా కమిటీలో సభ్యునిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఆ బాధ్యతలకు న్యాయం చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైకాపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డికి బిఎంఆర్ తన ధన్యవాదాలు తెలిపారు.

లాయర్
సెప్టెంబర్ 23, 2022

# ఒక్క మంచిమాట.. విశ్వశాంతికే బావుటా!

'ఎక్కడికెళ్తున్నాం..మనం?'..అని ఎవరికి వారు ప్రశ్నించుకున్నప్పుడు, ఇప్పుడు మనం ఎక్కడున్నామో..మన ప్రయాణమెక్కడికో.. చివరికి గమ్యమెక్కడికో'.. అన్నవి స్ఫురణకు వస్తాయి. మానవజీవితాలకు అర్థం పరమార్థం ఏమిటన్నది గ్రహింపుకు వస్తే.. మన జీవితాల్లో అవే గణనీయమైన మార్పులు తెస్తాయి. కాస్త నిలకడగా మనసుపెట్టి మానవీయతతో ఆలోచిస్తే..ఇప్పుడు ప్రపంచం ఎటుపోతోందో ఎవరికైనా అర్థమవుతుంది. రకరకాల హింసలు, యుద్ధాలు, రక్తపాతాలు ఎంత అనవసరమో తెలిసిపోతుంది. దేశమేదైతేనేం..మనుషులంతా ఒకటేననీ, అందరి రక్తం ఒకటేననే విషయం బోధపడుతుంది. ఒకరినొకరు హింసించుకోవడం, ఒకదేశం మరొకదేశంతో యుద్ధాలకు దిగడం ఎంత శోచనీయమో తెలుస్తుంది. అయినా.. ఇదేమైనా అజ్ఞానంతో నిండిపోయిన అనాగరిక కాలం కాదే!..విజ్ఞానం వెల్లువలా ప్రవహించే అద్భుతమైన ఈ అధునాతన యుగంలో కూడా ఇంకా యుద్ధాలేమిటి?.. ఈ చావడాలు.. చంపుకోవడా లేమిటి?.. ఎక్కడున్నాం మనం?...ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలను కరకరా నమిలేస్తున్న కరోనా వంటి రాకాసి వ్యాధులతోనో, మానవాళిని భయపెడుతున్న ఏ ఉగ్రవాద మూకలతోనో, నెత్తురు రుచిమరిగిన పైశాచిక శక్తులతోనో యుద్ధం చేసి సకలజనావళికి శాంతియుత జీవనాన్ని ప్రసాదించాల్సిన తరుణంలో..యుద్ధాలతో సాధారణ ప్రజల్ని సైతం దారుణ మారణహోమాలకు బలిచేయడం.. ఏమిటి దంతా?.. చివరికి సాధించేదేమిటి?.. ప్రపంచానికిప్పుడు కావాల్సిందేమిటి?.. అన్న వస్త్రాలా?..అణ్వస్త్రాలా?..ఆలోచించుకోవాలి. అయినా, తీర్చగలిగితే ప్రపంచవ్యాప్తంగా సమస్యలెన్ని లేవు?.. మనకున్న విజ్ఞానంతో ఎన్ని సంక్షోభాలనో తీర్చవచ్చు. కానీ చేస్తున్నామా?.. కరోనా రక్కసి వీరంగం చేస్తుంటే కంటికి కనిపించకుండానే ప్రపంచంలోని మనుషుల్ని నంజుకు తింటూనే ఉందే!.. దానిపై చేయాలి కదా యుద్ధం?!.. చేశామా?.. దానిని పూర్తిస్థాయిలో ఓడించగలిగామా?.. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో కోట్లాదిమంది నిరుపేదలు, 'అన్నమో రామచంద్రా' అంటూ ఆకలికి అల్లాడుతున్నారే!..పేదరికం, నిరుద్యోగం వంటి దౌర్భాగ్యాలనేమైనా నివారించగలిగామా?.. ఎక్కడున్నాం మనం?..ఏమైపోతోంది మన జ్ఞానం?.. విజ్ఞానం?.. ఏ యుద్ధం ఏం సాధించిందనీ?...చరిత్ర తిరగేసి చూడండి!.. అంతా నెత్తుటిమయం..కాకుంటే కన్నీటి కాల్వలే కదా!. ఇంకా మనం అలనాటి పాతయుద్ధాల రోతకాలంలోనే ఉన్నామా?.. ఇదేనా మన ప్రగతి, ఇంతేనా మన గతి?.. అందరూ తర్కించుకోవాల్సిన సమయమిది. ఇకనైనా ఆ ధోరణి మారాలి. అందరూ సోదరభావంతో మెలగాలి. 'యుద్ధాలు వద్దు..శాంతి కావాలి' అన్న నినాదమే విశ్వమంతా మార్మోగాలి. ప్రపంచంలో ఎక్కడా యుద్ధాలకు, భీభత్సాలకు, రక్తపాతాలకు తావే లేకుండా చేసుకోవాలి. ఆ దిశలో మానవుడు ఒక్క అడుగు వేసినా చాలు.. పదడుగులు ముందుకు వచ్చి విశ్వశాంతి మనవైపు చేతులు చాపుతుంది. ఆ మంచిరోజు రావాలనే ఐక్యరాజ్యసమితి దేశాలన్నీ కలసి 1981లో 'అంతర్జాతీయ శాంతి దినోత్సవానికి' శ్రీకారం చుట్టాయి. ప్రతిఏటా సెప్టెంబరు 21వ తేదీన ప్రపంచశాంతి దినోత్సవం జరుపుకుని, విశ్వశాంతికి ప్రతిఒక్కరూ మేలుబాటలు వేయాలన్నదే ఐరాస లక్ష్యం. అందుకు తగ్గట్టుగా, భారత్ శాంతి తత్వానికి ప్రతీకగా ఇటీవల జరిగిన సంఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. 'ఇది యుద్ధాల కాలం కాదనీ, నేటి సమకాలీన ప్రపంచంలో యుద్ధాలకు తావులేదని..ఉక్రెయిన్‌పై యుద్ధం ముగించండనీ'.. భారత ప్రధాని మోడీ.. నేరుగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ముఖాముఖీగా సూచించడం..ఎంత గొప్పవిషయమో!. ప్రపంచదేశాలన్నీ ఈ విషయంలో మోడీ చిత్తశుద్ధిని, ఘనతను వేనోళ్ళ కీర్తించాయి కూడా. 'ఇది యుద్ధాల యుగం కాదు. ప్రజాస్వామ్యం, దౌత్యనీతి, చర్చలతోనే సమస్యలను పరిష్కరించుకోవాలి'.. అని మోడీ శాంతి సందేశాన్ని చెప్పగానే, రష్యా నేత పుతిన్ వెంటనే స్పందించి 'వీలైనంత త్వరగా యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైనవన్నీ చేస్తామని' బదులివ్వడం..నిజంగానే ఒక అద్భుతం!.. ఏదేమైనా, అందరూ యుద్ధాలకు స్వస్తిపలికి, శాంతికి స్వాగతం పలికితే.. మనల్ని కన్న నేలతల్లి ఎంతగా ఆనందిస్తుందో!.. అందుకే మన పెద్దలన్నారు. ఒక్క మంచిమాట ఎంతో మార్పు తెస్తుందని. 'ఇది యుద్ధాల కాలం కాదంటూ' ప్రధాని మోడీ పలికిన ఆ ఒక్క మంచి మాట.. ఇప్పుడు ప్రపంచమంతా మారుమోగుతోంది. ఒక్క మంచిమాట..నిజంగానే శాంతిని తెస్తుంది. ప్రపంచశాంతికే అది నిలువెత్తు బావుటాగా నిలుస్తుంది!.. ఏదేమైనా.. విశ్వమంతా శాంతిగా ఉండాలి. ఆ కల..త్వరలోనే సాకారం కావాలని ఆశిద్దాం!...

(సెప్టెంబరు 21..అంతర్జాతీయ శాంతిదినోత్సవం)

### సింహపురి సాహితీ రంగానికి లభించిన వరం

## ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి ఎట్టకేలకు రాష్ట్రప్రభుత్వం 5 ఎకరాల స్థలం మంజూరు చేసిందని 'లాయర్' ద్వారా తెలుసుకుని సంతోషం కలిగింది. సాహిత్యానికి, సాహితీవేత్తలకు ప్రఖ్యాతిగాంచిన ప్రాంతం సింహపురి. మహాకవి తిక్కన తిరిగిన నెల్లూరునేలపై అదే వారసత్వంతో తరతరాలుగా ఎంతో మంది విజ్ఞానవంతులు సాహితీ పరిమళాలు గుబాళింపచేస్తూనే ఉన్నారు. అనేక మంది మహామహులు అపారమైన జ్ఞాన సంపదతో సాహితీ రంగంలో రాణిస్తూనే ఉన్నారు. అలాంటి మన నెల్లూరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం కొలువు తీరడం నెల్లూరీయులందరికీ గర్వ కారణం. భారత మాజీ ఉపరాష్ట్రపతి వర్యులు వెంకయ్యనాయుడు గారి చొరవతో మన రాష్ట్రానికి, ముఖ్యంగా మన జిల్లాకి తరలివచ్చిన ఈ సంస్థకు రాజకీయ గ్రహణం పట్టకుండా విముక్తి కల్పించిన వారందరికీ నా నమస్సులు. పార్టీ ఏదైనా, నాయకుడు ఎవరైనా, చేసే పని మంచిదైనప్పుడు అభినందించాల్సిందే. మాతృభాష అమ్మవంటిది. మధురమైన మన ప్రాచీన తెలుగు భాష విశిష్టతను, భావితరాలకు తెలుపడానికి ఉపకరించే ఈ అధ్యయన కేంద్రం తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. 5ఎకరాల విస్తీర్ణంలో విశాల ప్రాంగణంలో ఈ విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటు కానుండడం తెలుగు భాషాభిమానులందరికీ లభించిన గొప్ప వరం.

పి.సురేంద్రబాబు, వెంకటాచలం.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

## సమస్యల ఊసేలేని శాసన 'సభ'

ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం వరకు 5 రోజులపాటు జరిగిన శాసనసభ సమావేశాల ముఖ్య అజెండా ఏమిటో అర్థం కాలేదు. మూడు రాజధానులు, ఆర్థిక వనరులు, పోలవరం, 'నాడు-నేడు'లో విద్య-వైద్య రంగాలలో జరిగిన మార్పులు వంటి విషయాలు తప్ప మరో అంశమే చర్చకు రాలేదు. ముఖ్యంగా రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా తయారయ్యింది. పారిశ్రామిక ప్రగతి, రహదారుల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలికసదుపాయాల కల్పన వంటి అనేక విషయాలలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. శాంతి భద్రతలు లోపించాయి. హత్యలు, దాడులు, దోపిడీలు మానభంగాల శాతం పెరిగిపోయింది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేకపోవడంతో వీటన్నిటినీ ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. రైతు సమస్యలపై చర్చించాలని డిమాండు చేసిన ప్రతిపక్షం మాట పట్టించుకున్న నాథుడే లేడు. స్వపక్షమే తమకు అనుకూలమైన నిర్ణయాలు ప్రతిపాదించి ఆమోదింపచేసుకుంది. మొత్తం మీద కోట్ల రూపాయలు ప్రజాధనం ఖర్చుపెట్టి నిర్వహించిన అయిదు రోజుల సమావేశాలు, ప్రజా సమస్యలపైన చర్చించకుండా, సమస్యల ఊసే లేని సభలుగా ముగిశాయి. బలమున్నోడిదే రాజ్యం... తెలివున్నోడిదే భోజ్యం!

- జి.వి.సుబ్బయ్య, పిడుగురాళ్ల.

# గజిబిజి రాతల 'నంబర్‌ప్లేట్లు'..
# తెస్తాయెన్నో ఇక్కట్లు!







'మన వాహనం కదా..మన ఇష్టం వచ్చినట్లు ఏమైనా చేసుకోవచ్చు, నంబర్‌ప్లేట్ల మీద ఏదైనా రాసేసుకోవచ్చు' అనుకునే ధోరణి ఇటీవలి కాలంలో బాగా ఎక్కువైంది. అలా చేయడం మంచిది కాదని, నిబంధనలు పట్టించుకోకుండా వ్యవహరించడం నేరమని కూడా తెలిసినా కొందరు వాటినేమీ ఖాతరు చేయకపోవడం విచారకరం. అతివేగం, అలక్ష్యం..అన్నవి అనేకమంది వాహనదారులకు బాగా అలవాటైపోయాయి. ర్యాష్ డ్రైవింగ్ చేయడం, అందులోనూ మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని తెలిసినా ఎవరూ లెక్కచేయడం లేదు. అలాంటివారిని అదుపుచేయడం పోలీసు యంత్రాంగానికి నిత్యం ఒక పెద్ద సవాల్‌గానే ఉంటోంది. కొందరు రాజకీయ నాయకులు కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అలాంటివాటికి మార్గదర్శకులుగా ఉంటుండడం ఇంకా దారుణం. కొంతమంది ఛోటా నాయకులు తమకేదైనా చిన్న పదవి వచ్చినా చాలు.. అదేదో ప్రధానమంత్రి పదవి అయినట్లుగా ఫీలింగ్. ఆ పదవినే తమ వాహనాల నంబర్‌ప్లేట్ మీద కూడా పెద్దపెద్ద అక్షరాలతో రాసేసుకుని దంబాలు పోతుంటారు. వాహనం నంబర్ మాత్రం చిన్నదిగా ఉంటుంది. అది కూడా సరిగా కనిపించదు. మామూలు జనం సంగతి చెప్పక్కర్లేదు కదా.. 'గొర్రెదాటు' అన్నట్లుగా అలాంటివాటినే గుడ్డిగా అనుకరిస్తుంటారు. ఇక కుర్రకారు సంగతి మరీ మిడిమేలం. ఏకంగా తమ ఫేవరిట్ హీరోల పేర్లను నంబర్‌ప్లేట్ల మీద దర్జాగా రాసేసుకుని, తామే హీరోలైపోయినట్లు రయ్‌మంటూ గాల్లో తిరిగేస్తుంటారు. నంబర్ ప్లేట్ల విషయంలో ఇలాంటి చిత్రవిచిత్రాలెన్నో ఉన్నాయి.

## సమస్యలతో 'రణం'

'8055'..అనే నంబర్‌ను..'బాస్' అని అనుకునేట్లుగా ఆ అంకెలను తమాషాగా వాడుకునేవారు కూడా ఎక్కువైపోయారు. '6055' నంబర్ కూడా ఇదే కోవలో ఆంగ్ల అక్షరాల్లో 'బాస్' అన్నట్లుగానే ఉంటోంది. చాలా మంది ఇలాంటి సరదాలకు అలవాటుపడుతున్నారు. ఆ గజిబిజి సంఖ్యలు (సంఖ్యలు మంచివే కానీ, వాటిని వేరే అర్థం వచ్చేట్లు రాస్తుంటారు) ప్రత్యేకించి పరికించి చూస్తే తప్ప అవి అంకెలని తెలియవు. చూసేందుకు అవన్నీ సరదాగా ఉండొచ్చు కానీ, ఆ తర్వాత సమస్యలొచ్చినప్పుడు తల బొప్పికట్టిస్తాయి. ప్రమాదాలు-లేదా నేరాలు జరిగినప్పుడు నేరపరిశోధనల్లో పోలీసుయంత్రాంగానికి కూడా ఇవన్నీ సమస్యలుగానే ఉంటున్నాయి. అందుకే, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు చేసినప్పుడు, ఆ వాహనాల నంబర్లను వెంటనే గుర్తుపట్టాలంటే నంబర్లు స్పష్టంగా ఉండాలి. నంబర్‌ప్లేట్లను రకరకాలుగా నేరాలకు ఉపయోగించడం నేరగాళ్ళకు అలవాటు. నిఘా కెమెరాలకు కూడా అంతుబట్టని విధంగా వారు వీటిని మార్చేస్తుంటారు. అలాంటివాటిని తెలిసో తెలియకో, మూర్ఖత్వం వల్లనో, తమ గొప్పదనం చాటుకోవాలనో కారణమేదైతేనేం... మామూలు వాహనదారులు కూడా చేయడం, తమ నంబర్‌ప్లేట్ల మీద లేనిపోని రాతలు రాసుకోవడం మంచిది కాదు. అలా చేయడం నేరం కూడా. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడో లేదా వాహనాలు అపహరణకు గురైనప్పుడో, జరగరానిదేదైనా జరిగినప్పుడో సంబంధిత వాహనదారులు చిక్కుల్లో పడకుండా ఉండాలంటే నంబర్‌ప్లేట్లు నియమనిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం అవసరం.

ఈ పరిస్థితులన్నిటిని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం వాహనదారులకు నంబర్‌పేట్ల విషయంలో నియమాలను ఇటీవల మరింత కట్టుదిట్టం చేసింది. దానిప్రకారం, వాహనాలు నంబర్‌ప్లేట్ లేకుండా తిరగకూడదు. నంబర్‌ప్లేట్లను గుర్తించకుండా ఉండే ఇతరత్రా రాతలు రాయకూడదు. వాహనాలు పెద్ద అక్షరాలతో, నంబర్లు బాగా కనపడేవిధంగా స్పష్టంగా ఉండాలి. రిజిస్ట్రేషన్ నంబరు తప్ప, మరేమీ నంబర్‌ప్లేట్ల మీద రాయకూడదు. ప్రాంతీయభాషలో రిజిస్ట్రేషన్ నంబర్లను చిన్న అక్షరాలుగా రాయడం చట్టవిరుద్ధం. నంబర్‌ప్లేట్‌లో తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాన్ని అతికించి తిరగడం కూడా నేరమే. సాదా కాగితంపై కలిపి రాసిన సంఖ్యలను వినియోగించకూడదు. అంతేకాదు, నంబర్‌ప్లేట్లపై సంఖ్యల పరిమాణం ఎలా ఉండాలో కూడా నియమాలు సూచిస్తున్నాయి. ద్విచక్రవాహనం, త్రిచక్రవాహనాలు మినహా అన్ని వాహనాల రిజిస్ట్రేషన్ సంఖ్య 65 మిల్లీమీటర్ల ఎత్తు, 10 మిల్లీమీటర్ల మందం, వాటి మధ్య 10 మిల్లీమీటర్ల అంతరం ఉండేలా చూసుకోవాలి. ఇలా నియమాల ప్రకారం లేని నంబర్లను, రహదారులపై వెళ్ళే వాహనాల నంబర్లను సీసీ కెమెరాలు వెంటనే గుర్తించాలంటే నంబర్‌ప్లేట్లు స్పష్టంగా ఉండాలి. నేరస్తులు తాత్కాలిక వాహనాలపై తాత్కాలిక నంబర్‌ప్లేట్లను వినియోగిస్తుంటారు. నేరం చేశాక వాటిని మార్చేస్తుంటారు. అందువల్ల నంబర్‌ప్లేట్లపై ఉన్న సంఖ్యలు సరైనవిగా, స్పష్టంగా ఉండాలని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆదేశాల్లో హెచ్చరించింది. అందువల్ల వాహనాలు నడిపేవారు ఇలాంటివాటి పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగించుకోవాలి. వాహనాలు ఉండడమే కాదు, వాటిని సక్రమంగా నడపడంలో ఉన్న నియమాలను కూడా కచ్చితంగా తెలుసుకోవాలి. అంతేకానీ మన వాహనం.. మనిష్టం అంటే కుదరదు. కనుక తస్మాత్ జాగ్రత్త!.. నంబర్‌ప్లేట్లు నిర్దుష్టంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవడం వాహనదారులకు తప్పనిసరి. లేకుంటే.. లేనిపోని కష్టాలు కొనితెచ్చుకున్నట్లే మరి!...

- సంచారి

## ఏపి హైకోర్టు కేంద్రప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా

# పెల్లేటి రాజేష్‌కుమార్



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పెల్లేటి రాజేష్‌కుమార్‌ను నియమిస్తూ కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. రాజేష్‌కుమార్ రాష్ట్ర హైకోర్టులో కేంద్రప్రభుత్వ కేసులను పర్యవేక్షిస్తున్నారు. వీరి తండ్రి సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాల్‌రెడ్డి. ఎంతో కీలకమైన స్థానంలో రాజేష్‌కుమార్‌ను కేంద్రం నియమించడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

# దివ్యాంగులకు జైపూర్ కృత్రిమ అవయవాలు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నో మంచి సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే ఉత్తమ స్థానం సాధించిందని జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రశంసించారు. నెల్లూరులోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటైన జైపూర్ ఉచిత కృత్రిమ అవయవాల ఏర్పాటు శిబిరాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సందర్శించి దివ్యాంగుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ 18 ప్రాజెక్టులతో ప్రజలందరికీ ఉపయోగపడే అనేక సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో జిల్లా రెడ్‌క్రాస్‌కు ప్రత్యేక గౌరవం లభించిందన్నారు. రక్తనిధి, క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహణలోనూ జిల్లా శాఖ ప్రత్యేకత సంతరించుకుందన్నారు. ప్రతిరోజు సంస్థలో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు చేస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ కొనియాడారు. ఈ సంస్థకు ఎప్పటికప్పుడు తోడ్పాటు అందిస్తున్న దాతలను ఆయన అభినందించారు. గతంలో నిర్వహించిన శిబిరంలో దివ్యాంగులకు కావలసిన కృత్రిమ అవయవాలకు సంబంధించిన కొలతలు తీసుకొని రాజస్థాన్ నుంచి అందుకు తగినట్లుగా కృత్రిమ అవయవాలను తయారుచేయించి తెప్పించడం జరిగిందని, ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి మంచి స్పందన లభించిందని కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు జైపూర్ కాలు, చేయి, పాదాలు ఉచితంగా అందించే కార్యక్రమానికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకారం చుట్టడం సంతోషకరమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. అనంతరం కృత్రిమ అవయవాలు తొడుక్కున్న దివ్యాంగులతో మాట్లాడుతూ, అవి వారికి ఎలా ఉపయోగపడుతున్నాయో వారు పరిశీలించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, రవి ప్రకాష్, వెంకటేష్, రంగయ్య నాయుడు సుధీర్, సురేష్ కుమార్‌జైన్, వలంటీర్లు పాల్గొన్నారు.

# 'భారత్ జోడో' యాత్ర విజయవంతం కావాలి

## చెంగాళమ్మ దేవాలయంలో డిసిసి నేత చేవూరు పూజలు



కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో' యాత్ర విజయవంతం కావాలని ప్రార్థిస్తూ సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ అమ్మవారి దేవాలయంలో జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి పూజలు చేశారు. ఇటీవల ఆయన సూళ్ళూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెంకటయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసివెళ్ళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఇఓ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికి శాలువలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు బాల సుధాకర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌బాబు, గూడూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి పరిమళ వెంకటేశ్వర్లు, బిసి సెల్ కోఆర్డినేటర్ బ్రహ్మయ్య, శ్రీనివాసాచారి, పవన్‌కుమార్, రాజారెడ్డి, చంద్రశేఖర్, బాలకృష్ణ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్శిటీ.. పేరు మార్చే ఆలోచన దారుణం

## - మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి



ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరును మార్చాలనే ఆలోచన చేయడం దారుణమని, ఎన్టీఆర్ పేరు తీసేసి వైఎస్సార్ పేరుగా మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తుండడం దురదృష్టకర పరిణామమని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. 1986లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ యూనివర్శిటీని ఏర్పాటు చేశారని, 1998లో చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ పేరు పెట్టి ఆ మహనీయుడి గౌరవాన్ని ఇనుమడింపజేశారని, ఇప్పుడు ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్సార్ పేరు పెట్టాలనుకోవడం జగన్‌కి తగదని ఆయన పేర్కొన్నారు. అంతమాత్రాన వైఎస్ఆర్ ఆత్మకు శాంతి కలగదని అన్నారు. ఈ లెక్కన ఏ ప్రభుత్వం వస్తే వారు, ఇలా వారికి నచ్చిన పేర్లు పెట్టుకుంటూపోతే జాతీయస్థాయిలో పథకాలకు చివరికి గాంధీజీ, నెహ్రూజీ, డా. అంబేద్కర్, జగజ్జీవన్ రామ్, ఇందిరాగాంధీ, వాజ్‌పేయి వంటి మహనీయుల పేర్లు ఉండవని, అయితే అక్కడ ఇలాంటి ప్రయత్నాలేమీ జరగలేదని తెలిపారు. కోట్లాదిమంది తెలుగుప్రజల గుండెల్లో కొలువైవున్న ఎన్టీఆర్‌కి అవమానం చేయాలని చూడడం మంచిది కాదన్నారు.

# 'తంగిరాల మహాభారతం' పునశ్చరణ(పార్ట్-1)




ఇప్పటిదాక చెప్పుకున్న 21 భాగాలను రెండు భాగాలుగా పునశ్చరణ (recap) చేసుకుందాం.

EP 1. మహాభారత పరిచయం – ఆది కాలంలో ఒకే రాశిగా ఉన్న వేదాలను 4 వేదాలుగా విభజించాడు కృష్ణ ద్వైపాయనుడు. తర్వాత 3 సంవత్సరాలలో మహాభారతాన్ని రచించాడు. మహాభారతానికి పంచమ వేదమని, కృష్ణ ద్వైపాయనుకి వేదవ్యాసుడని పేరు వచ్చింది. మహాభారతాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన.

వేదవ్యాసుని శిష్యుడైన వైశంపాయనుడు భూలోకంలో జనమేజయ మహారాజుకు మహాభారతం గురించి వివరించాడు.

EP 2. కద్రువ, వినతల కథ – పూర్వకాలంలో కశ్యప ప్రజాపతికి ఇద్దరు భార్యలు కద్రువ, వినత. వారు అక్క చెల్లెళ్ళు. కద్రువకు వేయి మంది నాగ కుమారులు, వినతకు ఇద్దరు కుమారులు అనూరుడు, గరుత్మంతుడు. ఒకసారి ఒక తెల్లని గుర్రం తోక నల్లగా ఉందని కద్రువ, వినత పందెం వేసుకుంటే, కద్రువ వినతని మోసం చేస్తే, వినత జీవితాంతం కద్రువకి దాసురాలవుతుంది. తన పిల్లలు తన మాట వినలేదని వారిని శపిస్తుంది. రాబోయే కాలంలో జనమేజయ మహారాజు చేసే సర్పయాగంలో పడి నశించిపోతారు అని.

EP 3. గరుత్మంతుడు – తల్లి దాస్య విముక్తి – గరుత్మంతుడు నాగకుమారుల కోరిక మీదట ఇంద్రలోకం నుంచి అమృతం తెచ్చి నాగకుమారులకి ఇచ్చి తన తల్లిని దాస్యం నుంచి విడిపిస్తాడు. ఇంద్రుడు తర్వాత దొంగతనంగా వచ్చి, నాగకుమారులు స్నానానికి వెళ్ళినప్పుడు అమృతాన్ని తస్కరిస్తాడు.

EP 4. పరీక్షిత్‌కి శాపం – అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్ మహారాజు ఒక రోజు వేటకి వెళ్ళి ఒక లేడిని తరుముకుంటూ శమీక ముని ఆశ్రమానికి వస్తాడు. ఆ లేడి ఎటు పోయిందని అడిగినప్పుడు, శమీక మహర్షి పలకలేదని కోపగించి అతని మెడలో చచ్చిన పాముని వేసి వెళ్ళిపోతాడు. శమీక ముని కొడుకు శృంగికి కోపం వచ్చి 7రోజులలో పరీక్షిత్ మహారాజు తక్షకుని కాటుతో మరణిస్తాడు అని శపిస్తాడు.

EP 5. తక్షకుడి కాటుతో పరీక్షిత్ మరణం – శృంగి శాపం విని, పరీక్షిత్ మహారాజు ఒంటి స్తంభం మీద ఉంటాడు. చివరిరోజు సాయంకాలం తక్షకుడు కొందరి విప్రుల మారువేషంతో పండ్లు తెచ్చి పరీక్షిత్ మహారాజుకి ఇస్తాడు. పరీక్షిత్ మహారాజు ఒక పండు కోస్తే, దాంట్లోంచి తక్షకుడు బయటకు వచ్చి మహారాజుని కాటేసి చంపేస్తాడు.

EP 6. జనమేజయ మహారాజు సర్పయాగం – పరీక్షిత్ కొడుకు జనమేజయ మహారాజు తండ్రి మరణం విని సర్పయాగం చేస్తే అన్ని పాములు వచ్చి ఆ యాగంలో పడి దగ్ధమైపోతాయి, కానీ తక్షకుడు ఇంద్రుని దగ్గరకు వెళ్లి అభయం పొందాడు. ఇంద్రుని దగ్గర దాక్కున్నాడని తెలుసుకుని, జనమేజయ మహారాజు ఇంద్రునితో సహా తక్షకుణ్ణి సర్పయాగంలోకి పిలిస్తే, ఇంద్రుడు భయపడిపోయి తక్షకుణ్ణి వదిలేస్తాడు.

EP 7. సర్పయాగం మధ్యలో ఆగిపోవటం – వాసుకి చెల్లెలు కొడుకు ఆస్తీక ముని, జనమేజయ మహారాజు దగ్గరకు వచ్చి, తన మాటల ద్వారా ఒప్పించి సర్పయాగాన్ని మాన్పిస్తాడు. తక్షకుడు బతికిపోయాడు.

EP 8. వేదవ్యాసుని జన్మ వృత్తాంతం – వసుభూపతి మహారాజు తన వీర్యాన్ని ఒక డేగ ద్వారా భార్య గిరిక సుందరికి పంపుతున్నాడు, అది జారి ఒక చేప నోట్లో పడుతుంది, తర్వాత ఆ చేపను ఒక జాలరి పట్టుకుని కొస్తే దాంట్లో ఒక పాప, ఒక బాలుడు కనపడతారు, వారిని దసమహారాజు పెంచుతాడు, ఆ పాప సత్యవతి. ఆమె పెద్దయ్యాక పడవ నడుపుతుంటే, పరస్పర మునీంద్రుడు చూసి ఇష్టపడి ఆమెకు ఒక కుమారుణ్ణి ప్రసాదిస్తాడు, ఆయనే కృష్ణ ద్వైపాయనుడు

EP 9, 10 కచ, దేవయానిల కథ – బృహస్పతి కొడుకు కచుడు మృతసంజీవనీ విద్య కోసం శుక్రాచార్యుని దగ్గర శిష్యరికం చేస్తాడు, కానీ రెండుసార్లు రాక్షసులు చంపివేస్తారు. దేవయాని అతని మీద ప్రేమతో తండ్రిని బ్రతిమిలాడి బతికిస్తుంది. కచుడు మృతసంజీవనీ విద్య నేర్చుకుని వెళ్ళిపోతూ దేవయాని ప్రేమని తిరస్కరించి ఆమె శాపానికి గురి అవుతాడు, కచుడు కూడా దేవయానిని శపిస్తాడు.

EP 11 శర్మిష్ఠ, దేవయానిల వివాదం – దేవయాని, రాక్షస రాజు కూతురు శర్మిష్ఠ స్నేహితురాళ్ళు. ఒకరోజు జలకాలాడాలని అరణ్యానికి వెళితే, ఇంద్రుడు వాయురూపంలో వచ్చి వాళ్ళ బట్టల్ని చిందరవందర చేస్తాడు. ఆ హడావిడిలో శర్మిష్ఠ తన చీర కట్టుకుందని దేవయాని తిడుతుంది. శర్మిష్ఠ కూడా దేవయానిని తిడుతుంది. వాళ్ళిద్దరి మధ్య జరిగే తోపులాటలో శర్మిష్ఠ, దేవయానిని ఒక పాడుబడ్డ బావిలోకి తోసి తన దోవన తాను వెళ్ళిపోతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.







## 'దిశ' వాహనం వచ్చేసింది

బందోబస్తుకు హాజరయ్యే మహిళా పోలీసులు తమ విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతి జిల్లాకు 'దిశ' వాహనాలను ప్రత్యేకంగా కేటాయించింది. ఇందులో భాగంగా వాష్‌రూమ్స్, డ్రెస్సింగ్ రూమ్స్ తదితర ఆధునిక వసతులతో కూడుకున్న వాహనం ఈనెల 17న నెల్లూరుకు చేరుకుంది. 'దిశ మొబైల్ రెస్ట్‌రూమ్స్ కారవాన్' అనే పేరుతో వచ్చిన ఈ వాహనాన్ని జిల్లా ఎస్పీ విజయారావు పరిశీలించారు. ఏఎస్పీ (అడ్మిన్) హిమవతి, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ తనిఖీలు

**--- హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు తప్పనిసరి ---**

ఈనెల 20న జిల్లావ్యాప్తంగా ఉన్న ద్విచక్ర వాహనాల షోరూముల్లో రవాణాశాఖ ఉపకమిషనర్ చందర్ ఆదేశాల మేరకు అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వాహనాలను కొనుగోలు చేశాక వారు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు బిగించకుండా వాహనాలు ఇస్తున్నారన్న ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఆ ఆరోపణలు నిజమేనని అధికారులు గుర్తించారు. వాహనాలను విక్రయించేటప్పుడు తప్పనిసరిగా హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు బిగించిన తర్వాతే వాహనాలను కొనుగోలు దారులకు అప్పగించాలని షోరూమ్‌ల నిర్వాహకులను ఆదేశించారు. ఈ విషయమై ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎంవిఐ బాలమురళీకృష్ణ, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా..విశ్వకర్మ జయంతి



భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈనెల 17న నెల్లూరులోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. విరాట్‌నగర్‌లోని విశ్వకర్మ దేవస్థానంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి నగరోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్నంతా విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానం చేశారు. బాణసంచా వేడుకలతో, మేళతాళాల మధ్య స్వామివారి నగరోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. తొలుత పంచవృత్తుల పతాకాన్ని విశ్వబ్రాహ్మణసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి ఆవిష్కరించారు. సంఘం నాయకులు ఇందుకూరు రమేష్ కుమార్‌ఆచారి, బల్లవోలు రమణయ్యఆచారి, అలిమేలి శ్రీహరి ఆచారి, దండపాణి సురేష్‌ఆచారి తదితరులు పర్యవేక్షించారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

**-- సిఐటియు నేత నరసింగరావు పిలుపు --**




కేంద్రప్రభుత్వ విధానాలకు నిరసనగా, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నరసింగరావు పిలుపునిచ్చారు. ఈనెల 18న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఎస్పీడిసిఎల్ కమిటీ 7వ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు సిఐటియు మద్దతు ఉంటుందని చెప్పారు. విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వారి సమస్యలు తీర్చాలని ఆయన కోరారు. ఏపిఎస్పీడిసిఎల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, నాయకులు మునికృష్ణయ్య, శివప్రసాద్, పెంచలప్రసాద్, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం ఏపిఎస్పీడిసిఎల్‌కి కొత్త కమిటీని ఎన్నుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## స్విమ్మింగ్‌లో 3 బంగారుపతకాలు




మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరుగుతున్న ఎస్‌బికెఎఫ్ 7వ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన నెల్లిపూడి శ్రీనివాసులు తన సత్తా చాటుతూ ఏకంగా 3 బంగారు పతకాలను సాధించి అందరి ప్రశంసలందుకుంటున్నారు. నెల్లూరులోని జిల్లా కోర్టుల్లో ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఈ సందర్భంగా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, సహోద్యోగులు అభినందించారు.

### ఉద్యోగుల పట్ల

## ప్రభుత్వం సానుకూలంగా ఉండాలి

**- ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ**



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల ధోరణితో ఉండాలే తప్ప, సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేయడం మంచిపద్ధతి కాదని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపిజిఇఏ) రాష్ట్ర నాయకుడు కెఆర్ సూర్యనారాయణ అన్నారు. ఈనెల 18న నెల్లూరు పురమందిరంలో పెద్దఎత్తున జరిగిన ఆ సంఘం ప్రథమ కౌన్సిల్ మహాసభలో ఆయన పాల్గొన్నారు. 11వ పిఆర్‌సి అమలు విషయంలో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని, ఉద్యోగులకు డిఏ బకాయిలు చెల్లించకుండా ఖాతాల్లో వేసిన నగదును కూడా వెనక్కు తీసుకోవడం అన్యాయమన్నారు. ఉద్యోగులు బాధ్యతగా ఉంటూ ఉద్యోగ సంఘాల ఐక్యత పెంచగలిగితేనే ప్రభుత్వంతో పోరాడగలమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్‌రావు పేర్కొన్నారు. ఏపిజిఇఏ రాష్ట్ర సలహాసంఘం ఛైర్మెన్ చొప్పా రవీంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడడంలో ఏపిజిఇఏ మాత్రమే నమ్మదగినదన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజకుమార్, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.రమణారెడ్డి, వై.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌ఐలు ఎస్‌ఐలయ్యారు

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న తొమ్మిదిమంది ఏఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ డిఐజి డా.త్రివిక్రమవర్మ ఉత్తర్వులిచ్చి వారిని పలుచోట్లకు బదిలీ చేశారు. సిహెచ్ శ్రీనివాసరావు, కె.మధుసూదనరావులను ఇంటలిజెన్స్ విభాగానికి, ఎస్.సుబ్బరాజు, కె.రాజు. కె బాలకోటయ్యలను సిఐడికి, ఎం.వేణుగోపాల్, డి.దేవిడ్‌దాస్‌లను గుంటూరుకు, ఇ.వెంకటయ్య, వి.మాల్యాద్రిలను బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## డికెడబ్ల్యులో.. పౌష్టికాహారంపై అవగాహన

నెల్లూరులోని డికెడబ్ల్యు జూనియర్ కాలేజీలో ఈనెల 17న పౌష్టికాహారంపై అవగాహన సదస్సు జరిగింది. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కాలేషాబాషా, డాక్టర్ శ్రీనివాసనాయక్ పాల్గొని పౌష్టికాహారం ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి మాదాల రాము, కన్వీనర్ విజయ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కరుణకుమారి, ప్రసన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కనీసవేతనాల కోసం ధర్నా

రాష్ట్రంలో కనీస వేతనాలకు సంబంధించి దాదాపు 60 లక్షల మంది కార్మికుల వేతన సవరణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం దారుణమని, ఇకనైనా కార్మికులకు కనీస వేతనంగా 26వేలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల20న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నాందోళన జరిగింది. ఇకనైనా కనీసవేతనాల సలహామండలి సిఫార్సుల మేరకు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.



### బుట్టలు చేతపట్టి..

## చెత్తను ఏరివేసిన మేయర్, కమిషనర్

పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని చెప్పడమే కాక, తాము స్వయంగా బుట్టలు చేతపట్టి చెత్తను ఎత్తివేస్తూ అందరికీ స్ఫూర్తిని కలిగించారు నెల్లూరు నగర మేయర్ స్రవంతి, కమిషనర్ హరిత. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంతంలో వారు ఈనెల 17న వారు ఇండియన్ స్వచ్ఛతా లీగ్ ర్యాలీని నిర్వహించి పరిసరాల్లోని చెత్తనంతా శుభ్రం చేయడం అందరినీ ఆకట్టుకుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పర్యావరణాన్ని కాపాడాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం, 'స్వచ్ఛ భారత్'లో భాగంగా దేశమంతా సైకిల్‌ర్యాలీ నిర్వహించిన నెల్లూరు నగరానికి చెందిన పెంచలచైతన్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ చెన్నుడు ఎస్ఇ సంపత్, ఆరోగ్యాధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, కార్పొరేటర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## అవార్డులకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో ముగ్గురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వారి ఉత్తమ సేవలకు గుర్తింపుగా జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. నెల్లూరు కృష్ణ చైతన్య కాలేజీకి చెందిన సిహెచ్ పార్థసారధి రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులకు ఎంపికయ్యాడని, అదేవిధంగా జగన్స్ డిగ్రీకాలేజీకి చెందిన పి.చైతన్య, సాత్విక రాష్ట్రస్థాయి అవార్డులు సాధించారని విఎస్‌యు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్ తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారిని విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి, విఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి అభినందించారు.

## ఐటిఐ విద్యార్థులకు సర్టిఫికెట్లు



ఐటిఐలో వివిధ ట్రేడ్‌లలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఈనెల 17న కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి పద్మశ్రీ, నెల్లూరులోని భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా నిరంజన్‌రెడ్డిల చేతులమీదుగా షీల్డులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జి పద్మశ్రీ మాట్లాడుతూ ఐటిఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మంచి నడవడికతో ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలని, న్యాయపరమైన అంశాల్లో కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీనగర్‌లో దోపిడిదొంగలు

**నేరుగా ఇంట్లోకి జొరబడి.. నగలు లాక్కుపోయారు**

నెల్లూరు నగరంలో దొంగలే కాదు, దోపిడిదొంగలు కూడా విజృంభిస్తున్నారు. అందరూ మేలుకొని ఉండగానే దుండగులు నేరుగా ఇంట్లోకి వచ్చి, ఇంట్లో ఉన్నవారిపై దాడిచేసి నగలు దోచుకుపోయిన సంఘటన నెల్లూరు బాలాజీనగర్‌లో ఈనెల 20వ తేదీ జరిగింది. రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో ఇంట్లో టీవీ చూస్తున్న వృద్ధ దంపతుల ఇంట్లోకి జొరబడి, వారిని బెదిరించి నగలన్నీ దోచుకుపోవడం సంచలనం కలిగించింది. ముగ్గురు దుండగులు నేరుగా ఇంట్లోకి వచ్చేసి, లోపల తలుపులకు గడియపెట్టి, మంచంపై ఉన్న 90 ఏళ్ల పండువృద్ధురాలు రంగనాయకమ్మ ఒంటిపై ఉన్న 3 సవర్ల నగలు లాక్కున్నారు. ఇంట్లో ఉన్న సుబ్బారావు-అమ్మణ్ణమ్మ దంపతులపై దాడిచేశారు. అమ్మణ్ణమ్మ మెడలో ఉన్న 10 సవర్ల బంగారు నగలు కూడా లాక్కొని పరారయ్యారు.

# ఇక సర్వాంగసుందరంగా.. గణేష్ నిమజ్జన ఘాట్

- 10.50 కోట్లు మంజూరుచేసిన సిఎం
- ఎంపీ గ్రాంట్స్ నుంచి విపిఆర్ 40 లక్షలు
- లయన్స్‌క్లబ్ వారు 10 లక్షలు ఇచ్చారు

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడి**



నెల్లూరు చెరువు గట్టున ఉన్న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల అమ్మవారి ఆలయం సమీపంలో గణేష్ నిమజ్జన ఘాట్‌కు ఇక సర్వాంగసుందరంగా రూపుదిద్దుకోనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు అవసరమైన 10.50 లక్షల రూపాయల నిధిని మంజూరుచేయడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఆ నిధులతో పాటు ఎంపీ గ్రాంట్స్ నుంచి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) 40 లక్షల రూపాయలను, నెల్లూరు లయన్స్‌క్లబ్ వారు మరో 10లక్షల రూపాయలను కూడా అందజేయడంతో ఈ ఘాట్ శాశ్వతప్రాతిపదికన అభివృద్ధి చెందడానికి మార్గం సుగమమైంది. ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గణేష్ నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఈ ఘాట్ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసేలా రూపొందిస్తామన్నారు. ప్రహరీగోడలు, ఉద్యానవనం, చిల్డ్రన్‌పార్కు, ఫుడ్‌కోర్టు, టాయిలెట్లు, పార్కింగ్ స్థలం అన్నిటినీ నిర్మించి, చెరువులో ఐలాండ్‌ను కూడా తీర్చిదిద్దుతామని చెప్పారు. 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, వైకాపా నాయకుడు మిద్దె మురళీకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈసారి మరింత వైభవంగా.. శరన్నవరాత్రి వేడుకలు :

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 26 నుంచి 5వ తేది వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. అష్టాదశ శక్తిపీఠాలకు చెందిన 18 మంది అమ్మవార్ల విగ్రహాలను తాత్కాలికంగా ప్రతిష్టించి పూజలు చేస్తామని, ఆయా పీఠాల నుంచి పసుపుకుంకుమ, చీరలు, అక్షింతలు, అభిషేక జలాలు తీసుకువచ్చి ఈనెల 23న టిటిడి కల్యాణమండపం నుంచి భారీఎత్తున శోభాయాత్ర చేస్తామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి 130 మంది కళాకారుల స్వరనివేదనతో, 18 మంది నాట్యకళాకారులతో ఈ ఉత్సవం జరుపుతామన్నారు. ఆహ్వాన కమిటీ ఛైర్మెన్ విజయ కుమార్, ఆలయ ఇఓ గిరికృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ సేవలు ఆదర్శప్రాయం

జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు ఎంతో ఆదర్శప్రాయమని, బాధితుల కోసం వివిధ రకాల సేవలు అందిస్తూ జాతీయస్థాయిలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మంచి గుర్తింపు తెచ్చుకోవడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 18న ఆయన నెల్లూరులోని రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయంలో మొబైల్ వ్యాక్సినేషన్, మొబైల్ రక్తదాన వాహనాలను జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ సేవలు మార్గదర్శకమన్నారు. కోటీ 12 లక్షల ఖరీదు చేసే అధునాతన వసతులతో కూడిన మొబైల్ వాహనాలు నెల్లూరు జిల్లాకు కేటాయించడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రక్తపు నిల్వలు కొరవడిన సందర్భాలలో రక్తదాతల చెంతకే సిబ్బంది వాహనంలో వెళ్ళి రక్తం సేకరించే సౌకర్యం కలిగిందని, వివిధ రకాల వ్యాక్సినేషన్‌లను ప్రజలకు అందించటానికి కూడా వాహన సదుపాయం అవసరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో కలసి మంత్రి దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలను అందజేశారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ఎంతో గొప్పది



అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 21వ తేదీ బుధవారం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అందక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, అటువంటి వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేవారు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుల్లో కాకుండా సమాజసేవలోనూ ముందుండాలని సూచించారు. ఈ శిబిరంలో 150 యునిట్ల రక్తాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రి ప్రతినిధులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆఫీసర్ డా. సి.ఉదయ కుమార్‌రాజు, అన్ని విభాగాధిపతులు డా. సి.రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, హరినాథరెడ్డి, విక్రమ్‌కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ సివిల్ విద్యార్థుల ప్రతిభ



ఎన్‌బికెఆర్ ఐఎన్‌టి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 2021-22 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఆర్. రమేష్ ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణ రంగంలో ప్రసిద్ధిగాంచిన ఎల్ & టి బహుళజాతి సంస్థలో 6లక్షల రూపాయల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి విద్యార్థి రమేష్‌ను కళాశాలలో అభినందించి మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలల ద్వారా విద్యార్థినీవిద్యార్థులకు వివిధ ఉద్యోగాలకు అవసరమైన విధంగా తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డా. ఎన్.కిషాంధర్ మాట్లాడుతూ 2021-22 విద్యాసంవత్సరానికిగాను ఎక్కడా లేని విధంగా 73 మంది తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగం ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### మనుబోలు

## దుకాణాల్లో చోరీలు

జిల్లాలో దొంగలు చెలరేగిపోతున్నారు. మనుబోలు కోదండరామపురం మెయిన్ రోడ్డులో ఈనెల 19వ తేది రాత్రి దుండగులు అయిదు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. చేతికి దొరికినంత డబ్బును, వస్తువులను దోచుకుపోయారు. దుకాణాల షట్టర్లు పగులగొట్టి మరీ చోరీలు చేశారు. తమను పట్టిస్తాయేమోనని ఓ దుకాణంలోని సిసి కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా దొంగలు తెలివిగా దొంగిలించుకుపోయారు. ఆ తర్వాత బద్దెవోలు క్రాస్‌రోడ్డు దగ్గరున్న ఆంజనేయస్వామి దేవాలయంలో రెండు హుండీలను పగలగొట్టి అందులో ఉన్న డబ్బునంతా మూటగట్టుకుపోయారు. దొంగల జోరు పెరిగిపోతుండడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు హడలిపోతున్నారు. పోలీసులు రంగంలోకి దిగి దొంగల ఆచూకీకై దర్యాప్తు ముమ్మరం చేశారు.

### చిరమనలో పట్టపగలే దొంగలుపడ్డారు

ఏఎస్‌పేట మండలంలోని చిరమన గ్రామంలో ఈనెల 20న పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి ఉన్నదంతా దోచుకుపోయారు. ఆ ఇంట్లో ఉన్న సయ్యద్‌షకీల మధ్యాహ్నం వేళ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళివచ్చేలోపలే దొంగలు ఇల్లంతా గుల్లచేశారు. తలుపులు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న మూడుసవర్ల బంగారు నగలు, వెండివస్తువులు అపహరించుకుపోయారు. దొంగతనం జరిగిందని తెలుసుకున్నాక బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రంగంలోకి దిగి సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. పట్టపగలే మెయిన్ రోడ్డులో ఉన్న ఇంట్లోనే దొంగతనం జరగడంతో స్థానిక ప్రజలు దొంగలభయంతో బిక్కచచ్చిపోతున్నారు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి దొంగల ఆట కట్టించాలి.

# యువత మానవతతో రాణించాలి

### కృష్ణపట్నం పోర్ట్ సీఈఓ జీజె రావు




యువకులు మానవతా విలువలు కలిగి ఉండాలని ఆదాని కృష్ణపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో జీజె రావు పేర్కొన్నారు. ఇటీవల ఆయన ఆదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉచిత ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిక్షణలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ, నెల్లూరు జిలా 'సెట్నల్' వారి సహకారంతో అదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో 79 మంది యువకులకు ఆర్మీ ఎంపిక కోసం నెలరోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణలో భాగంగా యువకులకు 1600 మీటర్ల రన్నింగ్, చిన్ అప్, 9 మీటర్ల డిచ్ జంప్, జిగ్ జాగ్ బ్యాలెన్స్ వాక్‌తో పాటు ఆర్మీ నిర్వహించే రాత పరీక్షలకు సంబంధించి లెక్కలు, సైన్స్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ విభాగాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ యువకులకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలోఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా ఆర్మీకి ఎంపిక కాగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ పొందిన యువకులు ఆర్మీతో పాటు ఇతర రెక్రూట్‌మెంట్‌లకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. యువకులు ఎంత ఉన్నత స్థాయికి చేరినా తల్లిదండ్రులను, మాతృభూమిని, దేశసేవను మరువరాదన్నారు. ఈ శిక్షణ విభాగంలో ప్రతిభ చూపిన యువకులకు ప్రత్యేక ప్రోత్సాహాలను ఆయన అందజేశారు. ఆర్మీ ర్యాలీకి ఉపయోగపడే కిట్లను వారికి పంపిణీ చేశారు. అదాని స్కిల్ డెవలప్‌మెంట్ సౌత్ జోన్ హెడ్ దానిష్ ఖురేషి, ఆదాని కృష్ణపట్నం పోర్ట్ సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.



# 'మానవతా'వాదులకు సత్కారం



'మానవతా' సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన సంస్థ నిర్వాహకులు పలువురు మానవతావాదులను సత్కరించారు. తాము చేసే సేవా కార్యక్రమాలకు చేయూతనందిస్తున్న ప్రముఖ సీనియర్ ఆడిటర్, ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత, బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షులు, మానవతా డైరెక్టర్ శ్రీకంటి రామ్మోహన్‌రావును, విద్యా, సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డిలను మానవతా సంస్థ ప్రతినిధులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, మంజులమ్మలు సన్మానించారు.

## కాలధర్మం

# బెజవాడ అన్నపూర్ణమ్మ



శ్రీమతి బెజవాడ అన్నపూర్ణమ్మ సెప్టెంబర్ 16వతేది శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఆమె వయస్సు 81 సంవత్సరాలు. బెజవాడ సోదరులలో మూడవవాడు (రామచంద్రారెడ్డి – బుజ్జమ్మల సంతానం) స్వర్గీయ బెజవాడ దశరథరామిరెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మ. మాటలో మృదుత్వం, పలకరింపులో స్నేహతత్వం, ఆదరణలో ప్రేమతత్వం, నిస్వార్ధ మనస్తత్వం కలిగిన మానవతామూర్తి ఆమె.

జిల్లాలో పేరుగాంచిన దొడ్ల వారి ఆడపడుచుగా దొడ్ల సుందరరాజారెడ్డి – పుష్పవేణమ్మల 3వ సంతానంగా 1941 ఆగస్టు 11వ తేదీన పుట్టారు అన్నపూర్ణమ్మ. 1957 ఫిబ్రవరి 17న 16 సంవత్సరాల ప్రాయంలోనే దశరథరామిరెడ్డిని పరిణయమాడి మరో ప్రముఖ కుటుంబం బెజవాడ వారి 3వ కోడలయ్యారు. అప్పట్లోనే గూడూరులో పేరుగాంచిన అమెరికన్ మిషనరీ పాఠశాల 'షెల్లీ మెమోరియల్ గర్ల్స్ స్కూల్'లో 10వతరగతి వరకు తన సహచర విద్యార్థినితో మొదటి ర్యాంకు కోసం పోటీపడుతూ చదువుకునేవారు అన్నపూర్ణమ్మ. "అత్యంత చురుకైన ఈ అమ్మాయిని చదువు మాన్పించి పెళ్ళెందుకు చేస్తున్నారు" అని ప్రశ్నించడం కోసం పాఠశాల ప్రిన్సిపాల్ ఆ రోజుల్లో గూడూరు నుండి బుచ్చిరెడ్డిపాళెంలోని అన్నపూర్ణమ్మ వివాహ వేదిక గిరిజా టాకీస్ వరకు వెళ్లాడంటే ఆమె ఎంతటి తెలివైన విద్యార్థినో వేరే చెప్పక్కర్లేదు.

పెళ్ళైన రెండేళ్లకు 1959లో కుమారుడు నరేష్‌చంద్రారెడ్డికి, మరో ఏడాదికి అంటే 1960లో కుమార్తె సరితకు, ఆ తరువాత రెండేళ్లకు 1962లో మరో కుమారుడు శ్రీనాథ్‌కి ఆమె తల్లయ్యింది. తన బిడ్డల పుట్టినరోజులకు ఆమే సొంతంగా కేకులు తయారు చేసేవారు. నిత్యం కొత్త రకం వంటలను తయారు చేసి పిల్లలకు తినిపించడం ఆమెకు అత్యంత ఇష్టం. అన్నపూర్ణమ్మ చేతి ముద్దలు తినడం అంటే సెలవులకు బుచ్చి సంస్థానానికి చేరే అన్ని కుటుంబాల వారికీ మహా ఇష్టం. అటు బుచ్చిరెడ్డిపాళెం లోనూ, పరిసర గ్రామాలలోనూ, ఇటు తమ బంధువర్గంలోనూ అన్ని శుభకార్యాలకు బెజవాడ పంచపాండవుల కుటుంబం తరపున అన్నపూర్ణమ్మే తన భర్తకు తోడుగా వెళ్లేవారు. కొన్ని వందల పెళ్లిళ్లకు ఆమె హాజరయ్యారంటే అతిశయోక్తి కాదేమో.

దొడ్ల, బెజవాడ కుటుంబాలలో ఎవరింట పెళ్లి జరిగినా సందడంతా అన్నపూర్ణమ్మదే. పెళ్లికూతురుకు కావలసిన సకల సామాగ్రి ఎంపిక నుండి షాపింగు వరకు ఆమె హస్తం ఉండాల్సిందే. ఆమె ఎంపిక చేయాల్సిందే. చివరికి పెళ్లికూతురుని ముస్తాబు చేయడంలో కూడా ఆమెది అరితేరిన చేయి. అత్యంత ఆనందోత్సాహాలతో సాగిపోతుండిన ఆమె జీవితాన్ని చూసి విధికి కన్ను కుట్టింది. 1973 లో పదమూడేళ్ళ ప్రాయంలోనే ఆమె కుమార్తెను ఆమెకు దూరం చేసింది. ఊహించని ఆ విషాద సంఘటన అన్నపూర్ణమ్మను బాగా క్రుంగతీసింది. ఆ షాక్ నుండి కోలుకోవడానికి ఆమెకు కొన్ని సంవత్సరాలు పట్టింది.

ఆమెకు మహా బంధుప్రీతి. 1977లో తన భర్తతో కలిసి 4నెలలపాటు విదేశ యాత్రలు చేసి ఖండాంతరాలు దాటి నివసిస్తున్న తన బంధువులందరినీ కలుసుకుని వచ్చారు. భారతదేశంలో కూడా ఆమె చూడని ప్రాంతాలు బహుశా బహు అరుదుగా ఉంటాయేమో. ఆమె యాత్రల గురించి ఒక పెద్దగ్రంథమే రాయొచ్చని ఆమె కుటుంబీకులు చెప్పడం గమనార్హం. అంతేకాదు ఆమె జీవిత కథ రాయాలన్నా వందల పేజీలు సరిపోవన్నది వారి భావన.

బుచ్చిరెడ్డిపాళెంలో ఉమ్మడి కుటుంబంలో ఉంటూ ఆదర్శ గృహిణిగా పేరు తెచ్చుకున్నారు. 1978లో మైకా వ్యాపారం కోసం తమిళనాడులోని మారుమూల ప్రాంతంలో గల కొల్లపల్లి గ్రామానికి తరలివెళ్లిన తన భర్తకు తోడుగా వెళ్లి ఉత్తమ ఇల్లాలుగా పిలిపించుకున్నారు. ఆధునిక భావాలు కలిగిన నాటి తరం మహిళగా, మారుతున్న కాలంతో పాటు తానూ మారుతూ వచ్చిన నేటితరం వనితగా, అమ్మగా, నానమ్మగా, జేజవ్వగా పరిపూర్ణ జీవితాన్ని ఆనందమయం చేసుకున్నారు. నాలుగేళ్ళ క్రితం 2018 జూలై 1న తనను వదిలి వెళ్లిపోయిన తన పతిదేవుని వెతుక్కుంటూ తానూ వెళ్లిపోయారు. అటు దొడ్ల, ఇటు బెజవాడ కుటుంబాల వారికి అన్నపూర్ణమ్మ లేని లోటు పూడ్చడం ఎవరి తరమూ కాదు. ఇంటి పెద్దదిక్కుని కోల్పోయిన బెజవాడ, దొడ్ల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ అన్నపూర్ణమ్మ ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## టిడ్కో ఇళ్ళ తాళాలు ఇస్తున్నాం



కమిషనర్ సాయినాథ్

గూడూరులో టిడ్కో ఇళ్ళు పొందిన లబ్దిదారులు వెంటనే వారికి కేటాయించిన ఇళ్ళల్లో చేరవచ్చని పురపాలక కమిషనర్ సాయినాథ్ తెలిపారు. గూడూరులోని పురపాలక కార్యాలయంలో ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ గాంధీనగర్‌లోని టిడ్కో గృహాలవద్ద ఎన్.సి.సి ఆఫీసులో లబ్దిదారులు రిజిస్ట్రేషన్ నకలు, ఆధార్ కార్డు, ఫోటో వంటివి సమర్పించి తాళాలు తీసుకోవచ్చన్నారు. టిడ్కో ఇళ్ళకు విద్యుత్, నీటి వసతులు కల్పించడం జరిగిందని వివరించారు.

## ఓటుకు ఆధార్ అనుసంధానం చేయాలి



తహసీల్దార్ లీలారాణి

గూడూరు మండలంలోని ఓటర్లందరూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తమ ఓటుకు ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయించుకోవాలని గూడూరు తహసీల్దార్ లీలారాణి పేర్కొన్నారు. ఈ నెల 20న స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 40శాతం మంది మాత్రమే ఆధార్ అనుసంధానం చేసుకున్నారని, ఓటర్లు అందరూ నియమించబడ్డ బిఎల్‌ఓలకు సహకరించి తమ ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలని ఆమె తెలిపారు.

## రోటరీ క్లబ్ 'ఇంజనీర్స్ డే'




రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో 'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్య 162వ జయంతిని పురస్కరించుకుని జరిగిన 'ఇంజనీర్స్ డే' కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభ, నిజాయితీ, నీటి పారుదల ప్రాజెక్టుల్లో ఆయన నైపుణ్యం భారతదేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శమన్నారు. సీనియర్ రొటేరియన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఎన్.ఎస్.రెడ్డి, బి.శ్రీకాంత్ రెడ్డి, బుజగేంద్రరావు, టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



సి.ఐ హజరత్‌బాబు

గూడూరు పట్టణంలోని అన్ని దుకాణదారులు తమ తమ వ్యాపారాలే లక్ష్యంగా కాకుండా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరించాలని గూడూరుటౌన్ సి.ఐ హజరత్ బాబు పేర్కొన్నారు. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులను పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలిపేలా వ్యాపారస్తులు తెలియజేయాలన్నారు. మునిసిపల్ కమిషనర్ సాయినాథ్, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుల సహకారంతో ట్రాఫిక్‌కి ఇబ్బందికరంగా ఉండే ఆక్రమణలను తొలిగించి పట్టణంలోని అన్ని ప్రాంతాలలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేలా కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం రాత్రి సమయాల్లోనే అన్‌లోడింగ్ చేసే విధంగా చూడాలన్నారు. వ్యాపారస్తులు తమ స్థల హద్దులు దాటి ఆక్రమిస్తున్నారని, అలాంటి వాటిని సహించేది లేదని, ఎన్టీఆర్ కాంప్లెక్స్ దుకాణ యజమానులు స్థలానికి మించి ముందుకు రావడంతో పండ్ల వ్యాపారులు రోడ్డుపైకి వస్తున్నారని, దాంతో రైల్వేస్టేషన్ నుండి హాస్పిటల్ రోడ్డు వరకు అనేక రకాల ట్రాఫిక్ ఇబ్బందులతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలందరి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారస్తులు తమ వ్యాపారాలను కొనసాగించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సి.ఐ హజరత్‌బాబు హెచ్చరించారు.

## డా. సిఆర్ రెడ్డి 'ఆసరా'



ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు బాగాలేని దివ్యాంగులను, వృద్ధులను ఆదుకునేందుకు డా. సి.జనార్ధన్‌రెడ్డి, డా. సి.రోహిణిలు చేపట్టిన 'డా. సి.ఆర్.రెడ్డి ఆసరా' కార్యక్రమం ఇటీవల డి.ఎన్.ఆర్ కమ్యూనిహాల్‌లో జరిగింది. ప్రతినెలా 3వ ఆదివారం 'డా. సిఆర్ రెడ్డి ఆసరా' క్రింద అర్హులుగా గుర్తించిన 20 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సి.జనార్ధన్ రెడ్డి, రోహిణిలు మాట్లాడుతూ సాటి ప్రజలకు చేయూతగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సాయం చేయడానికి తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా. పి.వి.కె.రెడ్డి, బి.దశరథరామిరెడ్డి, ఎన్.సిద్ధారెడ్డి, డి.ప్రజేంద్రరెడ్డి, బి.ధనుంజయరెడ్డి, కె.సనత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 2న ..

## రైతులకు పాస్‌పుస్తకాలు

భూముల రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో అక్టోబర్ 2న గాంధీజీ జయంతి సందర్భంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ చెప్పారు. ఈనెల 17న ఆయన మనుబోలు తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఎంతోకాలంగా రైతులు ఎదుర్కొంటున్న అనేకరకాల సమస్యలు భూముల రీ–సర్వేతో పరిష్కారానికి నోచుకుంటున్నాయన్నారు. జిల్లాలో 118 గ్రామాల్లో ఈ సర్వే ప్రారంభించగా, 70 గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సుధీర్, ఇఓపిఆర్డీ రమణయ్య, ఏఎన్ఎం శివరూపిణి పాల్గొన్నారు.

## శ్రీసిటీలో సక్సెస్ మీట్



సూళ్ళూరుపేట హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను గత నెలలో ఘనంగా నిర్వహించి విజయవంతం చేసిన నిర్వాహక కమిటీ సభ్యులను ఇటీవల శ్రీసిటీకి ఆహ్వానించి వారందరికీ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. దేశవిదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను శతాబ్ది వేడుకలకు ఆహ్వానించి అద్భుతంగా ఉత్సవాలు నిర్వహించినందుకు కమిటీ సభ్యులను, పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ తరపున ఏ.శ్రీనివాసులు, ఎల్.శ్రీనివాసులు, షేక్ ఉస్మాన్‌బాషా, వాసుదేవన్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థి జమీరుద్దీన్ అకాలమృతికి ఈ సందర్భంగా వారు తమ సంతాపం ప్రకటించారు.




## ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం ద్వారా..

# తెలుగుకు మరింత వెలుగు

### మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ద్వారా తెలుగుభాషకు మరింత వెలుగు చేకూరుతుందని, అలాంటి అపూర్వమైన అధ్యయనకేంద్రం నెల్లూరు జిల్లాలోని వెంకటాచలంలో ఏర్పాటు కావడం రాష్ట్రానికే గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటాచలం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ప్రాచీన తెలుగు భాషా అధ్యయన కేంద్రం భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థల ధ్రువీకరణ పత్రాలను మైసూరు భారతీయ భాషా సంస్థ డైరెక్టర్ శైలేంద్రమోహన్‌కు మంత్రి కాకాణి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని అనేక సమస్యలను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా తాత్కాలిక భవనంలో కొనసాగిన ప్రాచీన తెలుగు భాష అధ్యయన కేంద్రం సొంత భవన నిర్మాణానికి, అడిగిన వెంటనే కోట్లాది రూపాయల విలువైన 5. 5ఎకరాల స్థలాన్ని ఉచితంగా అందజేసి ముఖ్యమంత్రి తెలుగు భాష పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారని అన్నారు. తెలుగుకు ప్రాచీనహోదా కల్పించిన ఘనత దివంగత మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డిది కాగా, ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని రాష్ట్రానికి తీసుకురావడానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కేంద్ర భవనం నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించేలా వెంకయ్యనాయుడు సహకారంతో తమవంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రాచీన తెలుగు భాష అధ్యయనానికి, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఈ విశిష్ట అధ్యయన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను ఎప్పటికీ మరువరాదని, తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేలా అందరూ కృషి చేయాలని మంత్రి కోరారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆచార్య మునిరత్నంనాయుడు, మైసూరు భారతీయ భాషల సంస్థ డైరెక్టర్ ఆచార్య శైలేంద్ర మోహన్, ఆచార్య సివి శివరామకృష్ణ, ఆచార్య పంకజ్ ద్వివేది, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, ఆర్డిఓ మలోల, ఎంపీడీఓ సుస్మిత, తహశీల్దార్ నాగరాజుతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రాణాలు నిలబెట్టేది.. రక్తదానమే

### రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కౌన్సిల్ ఛైర్మెన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి




అన్నదానం కడుపు నింపితే, విద్యాదానం మంచి భవిష్యత్తును ప్రసాదిస్తుందని, అయితే అన్నిటికన్నా బాధితుల ప్రాణాలను నిలబెట్టే గొప్ప దానం రక్తదానమేనని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కౌన్సిల్ ఛైర్మెన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అన్నారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో విఎస్‌యు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇటీవల మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హేమచంద్రారెడ్డి, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జియం సుందరవల్లి ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విఎస్‌యులోని ఎన్ఎస్ఎస్ విభాగం చేస్తున్న రక్తదానం వంటి సేవాకార్యక్రమాలను ప్రశంసించారు. రక్తదానం ఎంతో విశిష్టమైన సేవా కార్యక్రమమని, యువత అందరికీ ఈ విషయంలో అవగాహన కల్పించి రక్తదానాన్ని ప్రోత్సహించాలని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జియం సుందరవల్లి సూచించారు. అత్యవసర పరిస్థితులలో బాధితులకు అందరూ అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వాలంటీర్లను ప్రశంసించారు. ఈ రక్తదాన శిబిరంలో 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయ ఆనందకుమార్ బాబు, జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డా. ఉదయ్ శంకర్ అల్లం, అధ్యాపకులు, విశ్వవిద్యాలయం కళాశాల మరియు అనుబంధ కళాశాలలైన కృష్ణచైతన్య, జగన్స్, వివేకానంద, రావూస్ విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లూరు, కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం హెల్త్ సెక్రటరీ మరియు అడ్మిన్ జి.మిరియమ్మ, పాండురంగ విచ్చేసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మాత్రలు మింగడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు మాట్లాడుతూ నులి పురుగుల సంక్రమణను తగ్గించడానికి గోళ్ళను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవడం, కూరగాయలు, పండ్లను శుభ్రమైన నీటితో కడగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, బయట తిరిగేటప్పుడు చెప్పులు ధరించడం, సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం లాంటి జాగ్రత్తలు విద్యార్థులు చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయులు.. గురజాడ

### - డికెడబ్ల్యు కాలేజీలో జయంతి వేడుకలు



ప్రముఖ సారస్వతవేత్త, సమాజ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీ (దొడ్ల కౌసల్యమ్మ మహిళా కళాశాల)లో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డా. కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ, గురజాడ తన రచనలతో సమాజానికి మార్గదర్శనం చేశారన్నారు. ముఖ్యంగా మహిళాలోకం అభ్యుదయానికి గురజాడ చేసిన కృషి అపారమని, అపూర్వమని కొనియాడారు. గురజాడ జీవితవిశేషాలను, తాను గురజాడపై చేసిన విశిష్ట పరిశోధనను ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులకు వివరించారు. భారతీయ సంస్కృతి గురించి, మహిళామణుల మహోన్నత వ్యక్తిత్వం గురించి గురజాడకు ఉన్న ఉన్నతమైన భావాలను, సమాజోద్ధరణకు ఆయన చేసిన సేవలను వివరంగా తెలియజేశారు. తన రచనల ద్వారా మహిళాభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు గురజాడ చిరస్మరణీయులని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగుశాఖ అధ్యక్షురాలు డా.వై దివ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డికెడబ్ల్యు కళాశాల తెలుగు అధ్యాపకులు డా.కెవి సత్యనారాయణ, డా.ఈశ్వరమ్మ, డా.ఎం.వెంకట్రావు, సరస్వతి సమాజం కార్యదర్శి టి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత విద్యార్థినులకు కవితల పోటీలు నిర్వహించి, అనంతరం బహుమతులు అందజేశారు.

## సమాజ సంస్కర్త.. గురజాడ



ప్రముఖ కవి గురజాడ అప్పారావు మహాసంస్కర్త అని, సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం అనితరసాధ్యమని పలువురు వక్తలు ప్రశంసించారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఈనెల 21న నెల్లూరులోని టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో స్థానిక కళాకారులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వాహకులు మురళీమోహన్, దోర్నాల హరిబాబు, జయప్రకాష్, అరవ రాయప్ప, శ్రీమన్నారాయణ, గౌస్‌బాషా పాల్గొని గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'కన్యాశుల్కం' రచన ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారని, 'దేశమంటే మట్టికాదోయ్..దేశమంటే మనుషులోయ్'..అంటూ స్వాతంత్ర్యపోరాటంలో ప్రజలను మేల్కొల్పి స్వాతంత్ర్యకాంక్షను రగిలించిన గొప్ప దేశభక్తుడని గురజాడను కొనియాడారు. గురజాడ ఆదర్శాల బాటలో నడవాలని కోరారు.

## టూకీగా...



### శ్రీ రాజరాజేశ్వరిదేవికి.. వైభవంగా ఊంజల్‌సేవ

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు ఇటీవల ప్రత్యేకపూజలు చేసి, వైభవంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటరెడ్డి-విజయ దంపతులు వ్యవహరించారు. ఆలయ ఇఓ గిరికృష్ణ, ఛైర్మెన్ రత్నం జయరామ్, ఆహ్వానకమిటీ ఛైర్మెన్ విజయకుమార్‌లు పర్యవేక్షించారు.

### దసరాకు ప్రత్యేక బస్సులు

దసరా పండుగ సందర్భంగా 50 ప్రత్యేకబస్సులు నడుపుతామని నెల్లూరుజిల్లా ప్రజారవాణా అధికారి పివి శేషయ్య తెలిపారు. హైదరాబాద్‌కు 20, బెంగుళూరుకు 20, విశాఖపట్నానికి 10 బస్సులు నడుపుతామని, ప్రయాణీకుల రద్దీ పెరిగితే మరిన్ని బస్సులు ఏర్పాటుచేస్తామని ఆయనో ప్రకటనలో పేర్కొన్నారు.

### పంచాయతీలకు నిధులివ్వాలి

పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చేందుకు నిధులు మంజూరు చేయాలని జిల్లాలోని పలువురు సర్పంచ్‌లు ఇటీవల నెల్లూరులోని జిల్లా పంచాయతి అధికారి ఎం.ధనలక్ష్మిని కలసి విన్నవించారు. పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్‌లు ఇచ్చి సమస్యలు తీర్చాలని వారు కోరారు.

### జ్వరాలతో జాగ్రత్తగా ఉండాలి

వాతావరణం మార్పుల దృష్ట్యా ఈ సీజన్‌లో జ్వరాలు వస్తుంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మనుబోలు మండలం మడమనూరులో ఇటీవల జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సుబ్బరాజు తెలిపారు. మడమనూరులో విషజ్వరాలు ఉండడాన్ని వైద్యసిబ్బంది గుర్తించారని పేర్కొంటూ, జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిహెచ్ఓ రాజయ్య, పిహెచ్ఎన్ జయశీల, ఏఎన్ఎం శ్రీదేవి, నాగయ్య పాల్గొన్నారు.

### వృద్ధులకు 'విశ్వమాత' చేయూత

నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న సాయి సేవాసదన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఇటీవల విశ్వమాత ఫౌండేషన్ వారు, తాము నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా దుప్పట్లు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డి.కల్యాణి ఆధ్వర్యంలో, ఎన్.సురేఖ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

### వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టొద్దు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టొద్దంటూ సిపిఎం నాయకులు ఈనెల18న ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రైతుల పట్ల ప్రభుత్వాలు అన్యాయంగా ప్రవర్తించడం మానుకోవాలని వారు కోరారు. సిపిఎం నాయకుడు కాకు వెంకయ్య ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.

### చిరమనలో 'ఏరువాక' కార్యక్రమం

అనుమసముద్రంపేట మండలంలోని చిరమన గ్రామంలో ఈనెల 18న ఏరువాక కార్యక్రమం జరిగింది. వ్యవసాయ పరిశోధకుడు డాక్టర్ ఓబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది రైతులు పాల్గొన్నారు. వరి సాగులో సమస్యలు, తెగుళ్ళ వంటి విషయాలపై ఆయన రైతులకు అవగాహన కలిగించి, తగు జాగ్రత్తలు సూచించారు.

### ఉద్యోగ పరీక్షలకు..ఉచిత శిక్షణ

ప్రభుత్వం నిర్వహించే వివిధ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని, బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపి స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ నెల్లూరు జిల్లా సంచాలకులు వెంకటయ్య తెలిపారు. వివరాలకు 93902 39588 నంబరుకు సంప్రదించాలని కోరారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఈ విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుంచి ఇంటర్ దాకా చదువుతున్న విద్యార్థులకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) వారు రూరల్ ఐటీ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు డిఇఓ రమేష్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వర్చువల్ పద్ధతిలో జరిగే ఈ పోటీలు సెప్టెంబరు నుంచి నవంబర్ వరకు నిర్వహిస్తారని, విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు చొరవ చూపాలని ఆయన సూచించారు.

# విమానాశ్రయం ఎగిరిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ఎన్నిసార్లు సర్వేలు చేశారో.. ఎంత ఖర్చుపెట్టారో.. ఎంత శ్రమపడ్డారో ఆ దేవుడికే తెలియాలి. ఎట్టకేలకు ఆ ప్రతిపాదనలన్నీ ఒక కొలిక్కివచ్చి, 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమానాశ్రయానికి శంకుస్థాపన కూడా చేశారు. ఇక త్వరలోనే విమానం ఇక్కడ ఎగురుతుందని అందరూ ఊహల్లో తేలిపోయారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. దామవరం కాకుండా మరోచోట విమానాశ్రయం ఏర్పాటుచేయాలని తాజాగా ప్రభుత్వం భావించడంతో జనం కలలు కల్లలుగానే మిగిలాయి. విమానం రాకుండా, ఏకంగా విమానాశ్రయమే ఎగిరిపోయిందిప్పుడు. దగదర్తి మండలంలో కష్టపడి సేకరించిన భూములు, పెట్టిన కోట్లాది రూపాయల ప్రజాధం వృధా అయిపోయింది. ఇంతకాలం ఊరిస్తూవచ్చిన విమానాశ్రయం ఇక ఇక్కడ ఉండదనే విషయం అక్కడి ప్రజలకు ఒక తీరని వ్యధగానే మిగిలిపోనుంది. కృష్ణపట్నం పోర్టుకు, జిల్లాలోని పరిశ్రమలకు ఆ విమానాశ్రయం వస్తే భలే బాగుంటుందని అనుకున్నవారంతా ఇప్పుడు ఏంచేయాలో తెలియక ఆకాశంలోకి గాలిచూపులు చూస్తున్నారు. భూమిలిచ్చిన రైతులు అయోమయంలో పడిపోయారు. ప్రత్యేకించి నెల్లూరీయులకు దామవరం దగ్గరే కనుక, విమానాశ్రయం వస్తే జామ్మంటూ విమానాల్లో ప్రయాణాలు చేయవచ్చనుకున్నవాళ్ళంతా..నిక్షేపంగా రైళ్ళు, బస్సులుండగా విమానాలెందుకు..లేనిపోని దండగ ఖర్చులు తప్ప..అన్నట్లుగా ఇప్పుడు నిరాశలో మునిగిపోయారు. ప్రజలొకటి తలిస్తే, ప్రభుత్వమొకటి తలచిందన్నట్లుగా తయారైంది పరిస్థితి.

## కందుకూరులో ఎయిర్‌పోర్ట్ :

దగదర్తి మండలం దామవరంలో ఏర్పాటు చేయాలనుకున్న విమానాశ్రయాన్ని మరోచోటకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో కందుకూరుకు ఆ అవకాశం లభించినట్లయింది. నెల్లూరుజిల్లాలో ఇటీవలే కొత్తగా కలసిన ప్రకాశంజిల్లా కందుకూరులో విమానాశ్రయం ఏర్పాటుకు సిఎం వైఎస్ జగన్ మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, అధికారులు ఇప్పటికే ఆ ప్రాంతంలో అందుకు అవసరమైన భూములను పరిశీలించినట్లు సమాచారం. ఒకప్పట్లో పాత నెల్లూరుజిల్లాలో నెల్లూరు–ప్రకాశం జిల్లాలు కలిసే ఉండేవి. ఆ తర్వాత వేరు వేరయ్యాయి. ఇటీవల కొత్తజిల్లాల ఏర్పాటులో నెల్లూరుజిల్లాకు తలకాయలాంటి ప్రాంతాలన్నీ తీసేసి, కళ్ళు తుడిచినట్లుగా కందుకూరును కలిపారు. ఇప్పుడు నెల్లూరుకు దూరంగా ఉన్న కందుకూరులో ఎయిర్‌పోర్టు వస్తుందంటున్నారు. ఇంకా మాట్లాడితే, 'ఎక్కడైతేనేం..అంతా నెల్లూరు జిల్లాయే కదా'.. అంటున్నారు. ఔను మరి!..విమానం ఎక్కి ఆకాశంలోంచి చూస్తే నెల్లూరు–కందుకూరే కాదు, తడ–తెట్టు కూడా పక్కపక్కనే కనిపిస్తుంటాయి?...ఏమంటారు?...

## కాలధర్మం

# పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి



సూళ్ళూరుపేట సీనియర్ నేత పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి (82) అనారోగ్యంతో ఉంటూ ఈనెల 18న కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం వైకాపా నాయకునిగా, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి సన్నిహితునిగా ఉన్న త్రిలోక్‌చంద్రారెడ్డి వీరి కుమారుడే.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో పెమ్మారెడ్డిని తెలియనివారుండరు. ఆయన ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషిచేసేవారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన రోజుల్లో సూళ్ళూరుపేట ప్రాంతం నుంచి టిడిపి జెండా పట్టుకున్న అతికొద్దిమంది నాయకుల్లో మునికృష్ణారెడ్డి ఒకరు. వేనాటి సోదరులతో ఉంటూ సూళ్ళూరుపేట ప్రాంతంలో పార్టీ బలపడడానికి ఆయన చేసినకృషి అపారం. టిడిపి తాలూకా అధ్యక్షునిగా ఉంటూ, 1983లో మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులయ్యారు. 1987–90లలో వ్యవసాయ కోఅపరేటివ్ సొసైటీకి అధ్యక్షునిగా, సింగిల్ విండో సంఘానికి ఉపాధ్యక్షునిగా కూడా పనిచేశారు. 1991లో ఆలిండియా రేడియో కడప స్టేషన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా, 1991 నుంచి 1995 దాకా నెల్లూరుజిల్లా టెలికాం బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా సేవలందించారు. టిడిపిలో కొంతకాలం ఉన్న తర్వాత కాంగ్రెస్‌లో చేరి క్రియాశీలకంగా వ్యవహరించారు. మాజీముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ వంటి ముఖ్య నేతలతో పాటు స్థానికంగా బద్దిపూడి, దువ్వూరు, వాకాటి, ఇసనాక తదితర కుటుంబాలతో సన్నిహితంగా ఉంటూ రాజకీయాల్లో బాగా రాణించారు. రాష్ట్రంలోని అనేకమంది ప్రముఖ నాయకులతో ఆయనకు సన్నిహిత, సత్సంబంధాలు ఉండేవి. సూళ్ళూరుపేట ప్రాంతంలో ప్రజలకు ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల్లో ఆయనెంతో మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, టిడిపి నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, మునిసిపల్ ఛైర్మెన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితో సహా అనేకమంది నాయకులు పార్టీలకు అతీతంగా సంతాపం ప్రకటించారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సోమవారం సూళ్ళూరుపేటలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో పెద్దసంఖ్యలో నాయకులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు పాల్గొని కడసారి నివాళులర్పించారు. తండ్రి మృతితో శోక సాగరంలో ఉన్న వారి కుటుంబానికి, కుమారుడు త్రిలోక్ చంద్రారెడ్డి తదితరులందరికీ ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరుకుంటూ, మంచినేతగా పేరుపొందిన మునికృష్ణారెడ్డి మృతికి చింతిస్తూ నివాళులర్పిస్తోంది.. లాయర్!

# హైదరాబాద్.. జిందాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఈ 'మాస్టర్ స్ట్రోక్'తో కేంద్రం పలు ప్రయోజనాలను ఆశిస్తున్నట్టు తెలిసింది. విశ్వనగరంగా హైదరాబాద్ రూపొందుతున్న తరుణంలో, దానిపై కేసీఆర్, ఆయన కుటుంబ పెత్తనం లేకుండా చేయడం ఇందులో ప్రధానమైనది. హైదరాబాద్ నుంచి లభించే వనరులు ఆ కుటుంబానికి అందుబాటులో లేకుండా చేయడం వారి లక్ష్యం. ఢిల్లీ తరహాలో నగరంలోని శాంతి భద్రతలు... పోలీసింగ్ వ్యవస్థను తమ చేతుల్లోకి తీసుకోవాలన్నది కేంద్రం ఆలోచన. ఆలా చేస్తే ఓల్డ్‌సిటీలో మజ్లిస్ పార్టీ రెక్కలు వీలైనంతగా కత్తిరించి వారి ఆధిపత్యానికి బ్రేకులు వేయొచ్చన్నది వారి వ్యూహం. వీటితో పాటు టీఆర్ఎస్ పెత్తనంలో నలిగిపోతున్న తెలుగు చలన చిత్ర సీమను విముక్తి చేయడం, హైదరాబాద్‌లోని కీలకమైన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం వంటి పలు ప్రయోజనాలతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ బీజేపీ అనూహ్యంగా బలోపేతం అవుతుందనే ఆశ కేంద్ర పెద్దలలో ఉన్నట్టు చెప్తున్నారు.

హైదరాబాద్ జనాభాలో 50 శాతానికి మించి స్థానికేతరులు నివసిస్తున్నారు. వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాలకు చెందిన వారు హైదరాబాద్‌లో ఇప్పటికే స్థిరపడ్డారు.. ఇంకా స్థిరపడుతున్నారు కూడా.

హైదరాబాద్‌లో నివసించే 'స్థానికేతరుల'లో ఎనభై శాతం మంది... ఆంధ్ర ప్రాంతానికి చెందినవారేనని కూడా బీజేపీ అంచనా. తమను టీఆర్ఎస్ నేతలు 'సెటిలర్స్'గా సంబోధించడాన్ని వారు జీర్ణం చేసుకోలేక పోతున్నారన్నది కమలం పార్టీ నాయకుల అభిప్రాయం.

ఈ సంబోధన వల్ల, తాము పెంచి పెద్దచేసిన హైదరాబాద్‌లో తాము ద్వితీయశ్రేణి పౌరులమనే భావన వారికి కలుగుతుందని, ఇలాంటి సమయంలో హైదరాబాద్‌ని తమ హస్తాల్లోకి తీసుకుంటే అటు పార్టీకి ఇటు తెలుగు రాష్ట్రాల ప్రజలకి ప్రయోజనం చేకూరుతుందని పార్టీలోని సీనియర్లు సూచిస్తున్నట్లు సమాచారం.

హైదరాబాద్ గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిని మరి కొద్దిగా విస్తరించి, కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం వల్ల అక్కడ నివసించే స్థానికేతరులు బీజేపీకి బ్రహ్మరథం పడతారనే అంచనా కూడా కేంద్ర బీజేపీలో ఉంది. తెలంగాణ... తెలంగాణేతర అనే భావనకు అవకాశం ఉండదు.

హైదరాబాద్ పరిధిలో 35 వరకు అసెంబ్లీ స్థానాలు, ఆరు లోకసభ స్థానాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటే టీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా కుంచించుకు పోతుందనే అంచనాలో బీజేపీ ముఖ్యులు కొందరు ఉన్నారు. పాత బస్తీ మినహా మిగిలిన అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్లలోనూ ఆంధ్ర 'సెటిలర్స్' గణనీయంగా ఉన్నారు. అందువల్ల, టీఆర్ఎస్ నుంచి హైదరాబాద్‌ను 'విముక్తి' చేయడంతో పాటు సీబీఐ, ఐటీ, ఈడీలను క్రియాశీలం చేస్తే తెలంగాణలో కుటుంబ పెత్తనానికి చరమగీతం పాడొచ్చని తెలుగు రాష్ట్రాల రాజకీయాలను బాగా అవపోసనపట్టిన జాతీయస్థాయి పదవిలో ఉన్న నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ గవర్నర్ తమిళిసై కూడా కేంద్ర ప్రభుత్వ నేతల దృష్టికి ఈ ఆలోచనను తీసుకెళ్లినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే, హైదరాబాద్ తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గా తమిళిసై చరిత్ర సృష్టించవచ్చు కూడా...!

కేసీఆర్ చేతిలో తీవ్ర అవమానానికి గురైన చిన జీయర్‌స్వామి సైతం కేంద్ర నాయకులవద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారని వార్త. వేల కోట్లకుపైగా విలువైన ఆయన ఆశ్రమం హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ముచ్చింతల్‌లో ఉంది. ఆయనతో నిన్న, మొన్నటి వరకు మమేకమై తిరిగిన కేసీఆర్ గానీ, ఆ పార్టీ నేతలు గానీ, ప్రభుత్వ యంత్రాంగం గానీ, ఆయన ఆశ్రమానికి ప్రధాని వచ్చి వెళ్ళినప్పటి నుండి అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్‌షాతో సహా పలువురు బీజేపీ ముఖ్యనేతలతో చిన జీయర్‌స్వామికి సుహృద్భావ సంబంధాలు ఉన్న సంగతి తెలిసిందే. మొన్నటి వరకు కేసీఆర్‌కి జైకొట్టిన జూపల్లి రామేశ్వరరావు కూడా ఇప్పుడు కమలంవైపు చూస్తున్నారు.

పాలనా పరంగా, ఆర్థిక కోణం పరంగా, రాజకీయంగా... హైదరాబాద్ జంట నగరాలను టీఆర్ఎస్ పట్టు నుంచి తప్పించడం అన్నది ఒక కోణం అయితే, జంట నగరాలతో పాటు ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ వంటి తెలంగాణ జిల్లాల్లో స్థిరపడిన ఆంధ్ర 'సెటిలర్స్' మద్దతు పొందడం బీజేపీ వ్యూహంలో ప్రధాన భాగంగా కనపడుతోందని కూడా తెరపైకి వస్తున్న ఈ తాజా ప్రతిపాదనను గమనిస్తున్న మేధావులు అంటున్నారు.

దేశంలోనే అవకాశాల గనిగా ('మైన్ అఫ్ ఆపర్చ్యునిటీస్')గా హైదరాబాద్ కీలకంగా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన వాక్సిన్ కంపెనీలు, ఫార్మా కంపెనీలు, ఐటీ కంపెనీలు, కార్పొరేట్ ఆస్పత్రులకు హైదరాబాద్ నిలయమైంది. ఇవన్నీ తన ప్రతిభగా టీఆర్ఎస్ చెప్పుకోవడం ఒక్క కేంద్ర పెద్దలకే కాదు... ఎవరికీ నచ్చడం లేదు.

ఉమ్మడి రాష్ట్రానికి రాజధాని కావడం వల్లే, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, సీసీఎంబీ, ఎన్ఎండీసీ, ఎన్‌జీఆర్ఐ, ఎన్ఎఫ్‌సీ, ఎన్ఆర్ఎస్ఏ, డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ, మిథాని, సౌత్‌సెంట్రల్ రైల్వే, ఎన్ఐఆర్డీ, బీడీఎల్, ఇక్రీసాట్, ఆర్మీకి చెందిన ఏఓసీ, సీడీఎం, ఎంసీఈయం, సీడీయం, సీఏడబ్ల్యూ వంటి దాదాపు 53 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పాటు అయ్యాయి. వీటి ఏర్పాటు వల్ల హైదరాబాద్‌కు లభించిన గౌరవాన్ని... ఎవరో ఒక్కరి ఖాతాలో వేయడానికి ఎవరూ ఒప్పుకోరు. అంతా తమ ఘనతే అని చేసుకుంటున్న ప్రచారాన్ని ఒప్పుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. రాజకీయంగా కూడా ఆంధ్ర బీజేపీకి 'విండ్ ఫాల్' లభించే అవకాశాలు ఉన్నాయి.

ఆంధ్రాలోని ప్రతి కుటుంబం నుంచి ఒకరో... ఇద్దరో ఉద్యోగాల కోసమో, వ్యాపారాల కోసమో, ఇతర చేతి వృత్తుల కోసమో, లేదా విశ్రాంత జీవితం గడపడం కోసమో, పిల్లల దగ్గర కాలక్షేపం చేస్తూనే కాలం చేయడం కోసమో హైదరాబాద్‌ను తమ కర్మ భూమిగా చేసుకున్నారు. వీరు, వీరితోపాటు ఆంధ్రలో నివసిస్తున్న వీరి కుటుంబాల వారు బీజేపీని నెత్తిన పెట్టుకుంటారని బీజేపీ నమ్ముతోందని సమాచారం. బీజేపీ, ఆంధ్రాలో ఒక్క శాతం దగ్గరే నిలకడగా ఉందన్న విషయం బీజేపీ కేంద్ర నాయకులకు మింగుడు పడడం లేదు. హైదరాబాద్‌పై బ్రహ్మాస్త్రం ప్రయోగించడం ద్వారా ఆంధ్రలో బీజేపీ ఓ పెద్ద పార్టీగా అవతరించగలదేమోనన్న చిన్న ఆశ కూడా భాజపా పెద్దలలో లేకపోలేదన్నది ఒక కమలం పార్టీ నాయకుడు వ్యక్తం చేసిన అభిప్రాయం.

## ఎప్పుడు?

తెలంగాణలో వచ్చే శాసనసభ ఎన్నికల్లోపే కేంద్ర నిర్ణయం ఉండవచ్చని అంటున్నారు. "తెలంగాణ నుంచి హైదరాబాద్‌ను విడదీయడం ఖాయం. అది ఎప్పుడన్నది వేచి చూడాలి" అని ఓ బీజేపీ యువజన నేత అన్నారు. అలా జరిగినా, జరుగుతుందని బీజేపీ పరంగా ఓ ప్రకటన లీక్ అయినా, జంట నగరాలలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను బీజేపీ స్వీప్ చేసే అవకాశం ఉంది.

రాష్ట్రం ముక్కలైనప్పటినుండి తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్న బాధ ప్రతి ఒక్క ఆంధ్రుడిలో ఉంది. తమ రెక్కల కష్టంతో నిర్మించిన హైదరాబాదును లాగేసుకున్నారన్న ఆవేదన ఇప్పటికీ చాలామంది మాటల్లో కనిపిస్తోంది. ఇలాంటి తరుణంలో హైదరాబాదును తెలంగాణ నుండి విడగొడితే అటు ఆంధ్రులను సంతృప్తి పరచడంతో పాటు ఇటు విశ్వనగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవచ్చన్న భాజపా వ్యూహం అమలైతే.. ఒక్క నిర్ణయంతో రెండు ప్రయోజనాలన్న వారి ఆశ ఫలించినట్లే.

# 26 నుంచి వాసవి మాత శరన్నవరాత్రోత్సవాలు

## • 200 కేజీల స్వర్ణాభరణాలతో అమ్మవారికి అలంకారం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 26 నుంచి అక్టోబర్ 6వతేది వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ గౌరవాధ్యక్షులు, 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ ఈ నెల 21న విలేకర్ల సమావేశంలో తెలిపారు. అక్టోబర్ 1వతేదిన భక్తుల నుంచి స్వీకరించిన సుమారు 200 కిలోల స్వర్ణాభరణాలతో అమ్మవారికి ధనలక్ష్మి అలంకారాన్ని చేయాలని సంకల్పించామని, కొత్తగా వెండిరథాన్ని కూడా ఏర్పాటు చేశామని, ఈనెల 26న నగరంలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ప్రాంగణం నుంచి 1008 మంది మహిళాభక్తులు 1008 కలశాల్లో పవిత్ర పినాకినీ నది జలాలను తీసుకువచ్చి రథానికి శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చేస్తామని ఆయన తెలిపారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా 26న 'శ్రీ భవాని' అలంకారం, 27న బాలాత్రిపురసుందరీదేవి, 28న అన్నపూర్ణాదేవి, 29న శ్రీ రాజరాజేశ్వరిదేవి, 30న శ్రీ గాయత్రి, అక్టోబరు 1న ధనలక్ష్మీదేవి, 2న సరస్వతి, 3న శ్రీ దుర్గాదేవి, 4న కన్యకపూజ, గజలక్ష్మీదేవి అలంకారం, 5న శమీపూజ, సాయంత్రం రథోత్సవం, 6న వసంతోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తామని ముక్కాల తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు సుంకు మనోహర్, అయితా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, పేర్ల సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# 3 ఖాయం. అయితే రాజధానులు - కాకపోతే తెలుగు రాష్ట్రాలు!

23 జిల్లాల సుభిక్షమైన ఆంధ్రప్రదేశ్... 13 జిల్లాల దుర్భిక్షమైన ఆంధ్రప్రదేశ్‌గా మారి ఎనిమిది సంవత్సరాలయింది. కానీ, ఇంత చిన్న రాష్ట్రానికి కూడా రాజధాని ఎక్కడో తెలియడం లేదు. వచ్చే ఎన్నికల్లోపు తెలిసే అవకాశాలు కూడా కనపడడం లేదు. మెలిక మీద మెలిక పడుతోంది. కోస్తా ఆంధ్ర నడిబొడ్డున... అమరావతి రాజధానిగా ఉంటే కమ్మవారి ప్రాబల్యం రాష్ట్రంలో బహుముఖం అవుతుందేమోనన్నది ప్రభుత్వ పక్ష అంచనా. దీంతో తెలుగువారికి ఒక రాజధాని అంటూ లేకుండా పోయింది. భిన్న మనస్తత్వాలు కలిగిన కోస్తా ఆంధ్ర, రాయలసీమ కలిసి బతకాల్సి రావడం ఒక అసహజం అయితే, గతంలో ఒక వెలుగు వెలిగిన రాష్ట్రానికి రాజధాని లేకపోవడం మరో అసహజం. ఒకసారి విడిపోయిన ఆంధ్రప్రదేశ్... అమరావతి కారణంగా మరోసారి విడిపోతుందా అనే అనుమానాలు రాజకీయవర్గాలలో మెల్లమెల్లగా ముసురుకుంటున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 2014లో విభజించారు. తెలంగాణను ఒక్క అంగుళం కూడా అటూ ఇటూ కదపకుండా అలాగే ఉంచేసి, ఉమ్మడి రాష్ట్రంలోని 13 జిల్లాల భాగాన్ని మాత్రం హైదరాబాద్ నుంచి తన్ని తరిమేశారు. దానిని కూడా 'ఆంధ్రప్రదేశ్' పేరుతో అపహాస్యం చేశారు. ఆ భాగానికి కూడా ఒక రాజధాని అంటూ ఏ ప్రాంతాన్నీ పేర్కొనకుండా... 'డై యువర్ ఓన్ డెత్' అన్నట్టుగా... విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వంపై పెత్తనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వ్యవహరించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్‌పార్టీ ఉరి వేస్తే, అది చూసి తట్టుకోలేని ఆంధ్ర ప్రజలు కాంగ్రెస్‌పార్టీని ఫ్యాన్‌కు వేలాడదీసి ఉరి తీశారు. ఇటు తెలంగాణలోనూ నేలకేసి కొట్టారు. ఒక రాజధాని అంటూ ఏ ప్రాంతానికీ అధికారిక గుర్తింపు లేకుండానే, ఒక రాష్ట్రం ఏర్పడిన పరిస్థితుల్లో... 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీని ఓటర్లు ఓడించారు. ఫలితంగా, పోటీచేసిన రెండో పార్టీ టీడీపీ గెలిచింది. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు.

విజయవాడ కృష్ణా నదికి ఆవలివైపు, ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా నది కరకట్టను చేర్చి, గుంటూరు జిల్లా అమరావతి మండల కేంద్రానికి దగ్గరలో కొత్త రాజధాని నగరాన్ని రూపొందించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆ ప్రాంతానికి 'అమరావతి' అని నామకరణం చేశారు. దాని పరిధిలో 29గ్రామాల నుంచి ముప్పై మూడు వేల ఎకరాలకు పైబడి రైతుల నుంచి భూమిని అతి లాఘవంగా సేకరించారు.

పరిపాలకుడిగా చంద్రబాబు అద్భుత వ్యూహ చతురతకు ఇది ఒక నిదర్శనమే అనవచ్చు. రైతుల భూములను సేకరించడంలో ఆయన చూపిన ఉత్సాహం, చొరవ, వేగం, దూర దృష్టి, పరిపాలనానుభవం మొదలైన వాటిని రాజధాని నిర్మాణంలో కూడా పరుగులు పెట్టించి ఉండవలసింది. అమరావతికి ఇప్పుడు ఈ కష్టాలు ఉండేవి కావు.

సచివాలయం, శాసనసభ వంటి అత్యవసర ఆవాసాలను మాత్రమే చంద్రబాబు కట్టించారు. తాత్కాలిక అవసరాల కోసం వీటిని కట్టించి, భవిష్యత్‌లో ఏదో కట్టబోతున్నామనే ప్రచారాన్ని మాత్రం పరుగులు పెట్టించారు. ఈ ప్రచారానికి ప్రథమ తాంబూలం ఇచ్చి, పాలనకు ద్వితీయ ప్రాధాన్యం ఇచ్చారు. ఏ విషయాన్నయినా... గోరంతలను కొండంతలుగా ప్రచారం చేయడమే ఆయన రాజకీయానికి పునాది. అదే గీటు రాయిగా ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనూ పాలన సాగించారు. ఇక్కడా అదే చేశారు.

'అమరావతి' అనే భావనకు... అవసరానికి మించిన బీభత్సమైన ప్రచారం కల్పించారు. సింగపూర్ అన్నారు. సౌత్ కొరియా అన్నారు. చైనా అన్నారు. దావోస్ అన్నారు. జపాన్ అన్నారు. కొరటాల శివ అన్నారు. రాజమౌళి అన్నారు. బాహుబలి అన్నారు. అమరావతి నిర్మాణాలు మాత్రం ముందుకు సాగవలసినంతగా సాగలేదు. మంగళగిరిలో నిర్మించిన డీజీపీ కార్యాలయం తప్ప రాజధానికి అవసరమైన ఇతర భవనాలన్నీ అరకొరగానే పూర్తి అయ్యాయి. అవి కూడా తాత్కాలికమే అన్న ఇంప్రెషన్‌ను చంద్రబాబు పదే పదే కల్పించారు. సచివాలయానికి బయట ఉండాల్సిన ప్రభుత్వ శాఖాధిపతుల కార్యాలయాలలో అధికభాగం అద్దె భవనాల్లోనే కొనసాగాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

నిజానికి, రాజధానిలో ముఖ్యమైన భవనాలు, సమస్త మౌలిక సదుపాయాల ఏర్పాటుకు... చంద్రబాబునాయుడుకు అయిదు సంవత్సరాల సమయాన్ని ప్రజలు ఇచ్చారు. ఎవరు చేయవలసిన పనులు వారికి అప్పగించి తాను చేయవలసిన పనిని చంద్రబాబు చేసి ఉన్నట్టయితే, అమరావతికి భౌతిక స్వరూపం 2019 ఎన్నికల నాటికే ఏర్పడి ఉండేది. కానీ, చంద్రబాబు ఎవరినీ పని చేయనివ్వలేదు. ఆయనా పనిచేయలేదు.

'ప్రపంచంలోని అయిదు అద్భుత రాజధానుల్లో ఒకటిగా 'అమరావతి', 'భవిష్యత్‌లో ఒలింపిక్ క్రీడలు అమరావతిలో నిర్వహిస్తాం', 'ఇంకో సింగపూర్‌గా అమరావతి' అంటూ ప్రజలను ఊహా లోకాల్లో విహరింపచేసే ప్రచారానికి మాత్రం అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

సింగపూర్ ఎలా ఉంటుందో చూసి రమ్మని, భూములిచ్చిన రైతుల్లో కొందరిని సింగపూర్ పంపించారు. ప్రపంచంలోని గొప్ప రాజధానులు కొన్నిటిని చూసిరండంటూ కొందరు అధికార – అనధికార ప్రముఖుల్ని విదేశాలకు పంపించారు. ఇదంతా ఆయన ఓ వ్యూహం ప్రకారమే చేశారనేది పలువురి పరిశీలకుల అభిప్రాయం.

అమరావతి గానీ, పోలవరం గానీ సగం... సగం పూర్తిచేసి, ఎన్నికలకు వెడితే అవి పూర్తి చేయడానికి చంద్రబాబే సమర్థుడు అన్న భావంతో... ఓటర్లు తెలుగు దేశం పార్టీకే రెండోసారీ అధికారం కట్టబెడతారని చంద్రబాబు ఆలోచించి ఉంటారని ఆ రోజుల్లో చాలామంది భావించారు. కానీ, రాజకీయ నేతల కంటే... జనం తెలివైనవారు. నిజానికి, తాడూ బొంగరం లేకుండా ఏర్పడిన కొత్త రాష్ట్రంలో ఏర్పడిన తొలి ప్రభుత్వంగా... దాని తరఫున చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన కనపడలేదని ప్రజలు భావించారు. పాలనలో... ప్రభుత్వ వ్యవహారశైలిలో నిజాయితీ, చిత్తశుద్ధి ప్రజలకు కనిపించలేదు. ఇదా తాము కోరుకున్న ప్రభుత్వం అనుకుంటూ జనం బిత్తరపోయారు.

2004 ఎన్నికలకు ముందు... అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబే... 2019 ఎన్నికలకు ముందూ ప్రజలకు కనిపించారు. అప్పుడు 294 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఉమ్మడి రాష్ట్రం కావడం వల్ల 48 స్థానాలు టీడీపీకి వస్తే, ఇప్పుడు 175 స్థానాలే ఉన్న రాష్ట్రం కావడం వల్ల 23 సీట్లు వచ్చాయి. 2014-2019 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు బాగా ఎక్కువ మాట్లాడుతూ... బాగా తక్కువ పని చేయడాన్ని జనం జీర్ణించుకోలేకపోయారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం బాగా లేదని ఎవరైనా ఆయన దృష్టికి తీసుకువస్తే, 'మనకు ఆల్టర్నేటివ్ మట్టుకు ఏముంది రాజప్పా...' అంటూ చంద్రబాబు తేలిగ్గా తీసిపారేసేవారు.




ఈ 'రాజకీయ' క్యాలిక్యులేషన్ల వల్ల అమరావతికి ఇప్పటి కష్టాలు. ఒకవేళ జగన్ గెలిస్తే అమరావతికి వచ్చే ముప్పును చంద్రబాబు ముందుగా అంచనా వేయలేకపోయారు.

అందుకే, దానికి 2019 ఎన్నికలలోపే ఓ రూపాన్ని తీసుకురావడానికి చంద్రబాబు పెద్ద ఆసక్తి చూపలేదు. అందుకే, అమరావతికి ఈ కష్టాలు.

మరో పక్క 2014 ఎన్నికలకు ఒక్క హామీ కూడా ఇవ్వని జగన్‌కు 2019 నాటికి ఎన్నికల తత్వం బోధపడింది. జనానికి తిక్క కుదరాలంటే... హామీలను మించిన వజ్రాయుధం లేదని జగన్‌కు అనుభవపూర్వకంగా అర్థమైంది. హామీలు ఇవ్వడానికి పెట్టుబడి గానీ, బాధ్యత గానీ అవసరం లేదని ఆయనకూ తెలిసొచ్చింది. హామీలు అంటే... పెట్టుబడి లేని రాజకీయ వ్యాపారం.

దాంతో, ఆయన 2019లో 'హామీల గోదా'లోకి దిగారు. తన హామీలతో... 2014నాటి చంద్రబాబు హామీలను మరిపించారు. హామీలతో చెడుగుడు ఆడుకున్నారు. అధికారంలోకి వస్తే, వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తా అంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జగన్ ఇచ్చిన హామీ కూడా ఈ పెట్టుబడి లేని రాజకీయ వ్యాపారంలో భాగమే. ఉద్యోగులకు జగన్ వ్యూహం అప్పుడు అర్థం కాలేదు. (ఇప్పుడర్థమైంది). ఇలా, అనేక కారణాలు కట్ట కట్టుకు వచ్చి, 2019లో చంద్రబాబును ఓడించాయి.

2014లో జగన్‌ను ఓడించినట్టే, 2019లో చంద్రబాబును జనం ఓడించారు.

వైసీపీ స్థాపన నాటి నుంచి చంద్రబాబు పొడ కూడా గిట్టకపోవడమే తన పొలిటికల్ ఫిలాసఫీగా పెట్టుకున్న కొత్త ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రావడంతోటే... ముందుగా చంద్రబాబు అధికార నివాసం పక్కనే ఉన్న 'ప్రజా దర్బార్' అనే ప్రభుత్వ భవనాన్ని కూల్చి వేయించారు.

అమరావతి అనేది చంద్రబాబు బ్రెయిన్ చైల్డ్. ఆయన మానస పుత్రిక. అందులో ఎవరికీ అనుమానాలు లేవు. కనుక రాష్ట్ర రాజధానిగా అది ఉండకూడదని జగన్ ముఖ్యమంత్రిగా పదవీస్వీకారం చేసిన మొదటిరోజునే భావించి ఉంటారు. అయితే, అందుకు తగిన పక్కా వ్యూహం మాత్రమే రూపొందించుకోలేకపోయారు. దీనికి తోడు, చంద్రబాబు కమ్మ కులానికి చెందినవారు కావడంతో పాటు తనకు ప్రధాన ప్రత్యర్థి అయిన తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని ముద్రపడిన కమ్మ సామాజికవర్గ వ్యతిరేకతే... వైసీపీకి పొలిటికల్ ఫిలాసఫీగా... గైడింగ్ ప్రిన్సిపుల్‌గా మారింది. జగన్ నేతృత్వంలోని అధికార యంత్రాంగపు పరిపాలనా రీతికి కూడా అదే ప్రాతిపదిక అయిందనే భావం రాష్ట్రంలో బాగా స్థిరపడిపోయింది.

అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందితే విజయవాడ – గుంటూరు – తెనాలి, వాటి పరిసరాలమధ్య ఉండే కమ్మ సామాజికవర్గం చేతిలోకి అది వెళ్ళిపోతుందని రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆ కులం బాగా స్థిరపడిపోతుందనే అంచనావల్ల కూడా జగన్ పాలనలో అమరావతికి కష్టాలు మొదలయ్యాయి.

నిజానికి, రెడ్డి సామాజికవర్గపు రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రమేయం లేని పులివెందులను, కడప జిల్లాను, కర్నూలు జిల్లాను, రాయలసీమను ఊహించుకోవడం ఎలా సాధ్యం కాదో, కమ్మ సామాజిక వర్గం ప్రమేయం లేని విజయవాడను, కృష్ణా జిల్లాను, తెనాలిని, ఈ పరిసర ప్రాంతాలతో పాటు కోస్తా ఆంధ్రను ఊహించుకోవడం కూడా అలాగే సాధ్యం కాదు.

నిజానికి రాయలసీమకు, కోస్తా ఆంధ్రకు మానసికంగా, భౌతికంగా చాలా దూరం. హైదరాబాద్ చాలా దగ్గర. అందువల్ల, ఉమ్మడి రాష్ట్రంలో రాయలసీమ దెబ్బ కోస్తా ఆంధ్రకు తెలియలేదు.

తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న అగ్రవర్ణం కూడా రెడ్డి సామాజికవర్గమే.

కోస్తా ఆంధ్రలో అనపర్తి... గొల్లల మామిడాడ... పల్నాడులో నరసరావు పేట, గురజాల, మాచర్ల, గుంటూరు వంటి కొన్ని పరిమిత ప్రాంతాలలోనే రెడ్డి సామాజిక వర్గం ప్రభావం కనిపిస్తుంది.

అందుకే, తమను ఆంధ్రలో కాకుండా తెలంగాణలో కలపమని అప్పటి కాంగ్రెస్ ప్రముఖుడు జేసీ దివాకర్‌రెడ్డి పదే పదే కేంద్ర కాంగ్రెస్ నాయకులను కోరారు. లేకపోతే, కర్ణాటకలో అయినా కలపండి అని వేడుకున్నారు. తెలంగాణలో కలిపితే మెజారిటీగా ఉండే తమ రెడ్డి సామాజిక వర్గం... రాయలసీమను ఆంధ్రాలో కలిపితే, మైనారిటీ అయిపోతుందనేది ఆయన పాయింటు.

రాయలసీమ రెడ్డి ప్రముఖుల జీవనం, వ్యాపారాలు, పరిశ్రమలు, రాజకీయం, మైండ్‌సెట్...అంతా హైదరాబాద్, దాని చుట్టుపక్కలే విస్తరించి ఉన్నాయి. రాయలసీమ యువత, ఉద్యోగార్థుల తొలి మజిలీ కూడా హైదరాబాదే. అందుకే, రాయలసీమ వాసులకు కోస్తా ఆంధ్ర కంటే, హైదరాబాద్ మీద అభిమానం ఎక్కువ. ప్రయాణం కూడా అంది పుచ్చుకున్నట్టుగా అనువుగా ఉంటుంది.

రాయలసీమ రాజకీయ ప్రభువుల భాష వేరు. వ్యవహారశైలి వేరు. ఆలోచనా తీరు వేరు. అసలు మైండ్‌సెట్టే వేరు. అందుకే, జేసీ దివాకరరెడ్డి ప్రకటనలకు... తెలంగాణ ఉద్యమకారులు కంగారు పడ్డారు.

'వామ్మో! మాకు రాయలసీమ వద్దు. మా తెలంగాణ 10 జిల్లాల వరకు మాకు ఇవ్వండి. మా బాధలేవో మేం పడతాం' అంటూ కాంగ్రెస్ కేంద్ర ముఖ్య నాయకులకు రాయబారాలు నడిపారు. మొరపెట్టుకున్నారు. సోనియమ్మ కరుణించింది. వారి కోరిక ఫలించింది.

విధి బలీయం కదా! భిన్న మనస్తత్వాలు, భిన్న రాజకీయ పోకడలు కలిగిన రాయలసీమ, ఆంధ్రను కలిపి.. ఒక అసహజమైన రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి, కోస్తా ఆంధ్రపై కక్ష తీర్చుకున్నారు. (అందుకే కోస్తా ప్రజలు కాంగ్రెస్‌ను ఫ్యాన్‌కు వేలాడదీశారు). దీంతో సీమ రాజకీయ పెద్దలు.... హైదరాబాద్‌ను అధికారికంగా వదిలేసుకుని విజయవాడలో జెండా ఎగరేశారు.

అదేదో సినిమాలో హీరో ప్రభాస్ చెప్పినట్టు.... ఇసుక లోడులారీ వెళ్లి స్కూటర్‌ను గుద్దినట్టయింది కోస్తా ఆంధ్ర పని, రాయలసీమ తాకిడికి. ఈ రెండు ప్రాంతాల మధ్య ఎమోషనల్ ఇంటిగ్రేషన్ కూడా లేదు. భావసారూప్యత లేదు. పులి – మేక లాంటి ఈ రెండు ప్రాంతాలూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖాముఖీ తలపడాల్సిన అవసరం ఏర్పడలేదు. కనుక, రాయలసీమ పవర్ ఏమిటో కోస్తా జనానికి అప్పుడు తెలియలేదు.

వారూ హైదరాబాద్‌పై ఆధారపడ్డారు. వీరూ హైదరాబాద్‌పై ఆధారపడ్డారు.

ఇప్పుడు ఈ రెండు ప్రాంతాలతో ఓ రాష్ట్రం ఏర్పడడంతో, కుల రాజకీయానికి అమరావతి బలి అయిపోతోంది.

ఇలా, అనేక కారణాలు, అపోహలు, రాజకీయ, మానసిక వైరుధ్యాలు, అనుమానాల నేపథ్యంలో... అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా వైసీపీ నేతలు ఒక్క నాటికీ అంగీకరించలేరు అనేది వాస్తవం.

అటు అమరావతినీ కాదని, ఇటు విశాఖనూ ప్రకటించలేకపోతే మరి, ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు రాజధాని ఏది అనే సందేహం ఎవరికైనా కలగడం సహజం.

జగన్ 2024లో 175కు 175 గెలిచినప్పటికీ, రాష్ట్ర హైకోర్టులో అమలులో ఉన్న 'రిట్ అఫ్ మాండమస్'ను సుప్రీం కోర్టు కొట్టివేయడమో... లేక, హైకోర్టు ఉపసంహరించుకోవడమో జరిగితే తప్ప, విశాఖపట్నం అంటే కుదరదు. అమరావతినేమో రాష్ట్ర రాజధానిగా జగన్ అంగీకరించే ప్రశ్నే లేదు. ఆయన భుజ బలాన్ని నమ్ముకుంటే, అమరావతి వాదులు బుద్ధి బలాన్ని నమ్ముకున్నారు. విశాఖపట్నంను రాజధానిగా ప్రకటించే అవకాశం లేనప్పుడు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమే సుఖమని ఆయన భావించే అవకాశం లేకపోలేదు. చూద్దాం మరి!

తెలుగు తల్లి నుదుట ఆ దేవుడు ఏమి రాసిపెట్టాడో!.

**- భోగాది వేంకట రాయుడు**

# 4వ వర్ధంతి

మా తండ్రి గారైన

## కీ॥శే॥ మెట్టుకూరు చినపిచ్చిరెడ్డి గారు

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి తేది.26.09.22 సోమవారం నాటికి నాలుగేళ్ళు గడవనున్న సందర్భంలో ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...



కీ॥శే॥ మెట్టుకూరు చినపిచ్చిరెడ్డి గారు

భార్య : శ్రీమతి **అమ్మణ్ణమ్మ**
సర్పంచ్, లింగంగుంట గ్రామ పంచాయితీ, అనంతసాగరం మండలం.

కుమారులు - కోడళ్ళు

**మెట్టుకూరు ధనంజయరెడ్డి - సంపూర్ణమ్మ**
మాజీ ఛైర్మెన్, నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు
అధినేత, ఎం.సి ఫౌండేషన్

**మెట్టుకూరు విజయభాస్కర్‌రెడ్డి - పద్మలత**

కుమార్తె : **బోయిళ్ళ మైథిలి**

మనుమలు - మనుమరాళ్ళు

**కోడూరు రామకృష్ణారెడ్డి - నాగజ్యోతి**
**డాక్టర్ గోపీనాథ్‌రెడ్డి - డాక్టర్ అనీష**

మరియు **మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

---




# శ్రద్ధాంజలి

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి
మా కుటుంబకీర్తి, మాకు స్ఫూర్తి

## శ్రీమతి బెజవాడ అన్నపూర్ణమ్మ గారు

(కీ॥శే॥ బెజవాడ దశరథరామిరెడ్డి గారి సతీమణి)
తే.16.09.2022ది శుక్రవారం రాత్రి పరమపదించినారు.
ఆమె ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

**బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి - ప్రత్యూష**
శ్రీనాధ, శ్రీప్రకృత్, డైసి, శరణ్‌రామ్,
నిఖిత - రివాన్, శ్రేయంత్, శ్రీకరణ్ - అంజలి

### ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తే.28.09.2022ది బుధవారం ఉదయం 11 గంటలకు నెల్లూరు, దర్గామిట్టలోని ఎం.జి మాల్ వెనుకవైపు గల బెజవాడ ఓబుళరెడ్డినగర్‌లోని అర్పిత విల్లా అపార్ట్‌మెంట్‌లోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com